జీవనోపాధులు
... భవితవ్యం
డిసెంబర్ 2013

# జనహృదయాలలో

# ఎస్.ఎస్. మనోహరన్



మార్గం చూపిన మనోహరన్ ! 9

**మ**నసు నిండా మనోహరన్ ఉన్నారు.

తెలంగాణా ఏర్పాటు ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది!

ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీని కైవసం చేసుకోగా బి.జె.పి. రాజస్థాన్‌ని చేజిక్కించుకుని మధ్యప్రదేశ్‌ని మరియు ఛత్తీస్‌ఘఢ్‌ని నిలుపుకుంది. కాంగ్రెస్ మిజోరాంను నిలుపుకోగలిగింది!

దేశంలో సరికొత్త రాజకీయ వాతావరణం చోటు చేసుకుంటోంది.

ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల రంగంలో!

లోక్‌పాల్ ఇప్పుడొక చట్టం!

బడుగు వర్గాల ప్రజల కోసం, స్వశక్తిని నమ్ముకున్న వారి సమిష్టి కోసం 25 సంవత్సరాలు అంకితభావంతో కృషి చేసిన ఒక అభివృద్ధి కార్యకర్త జీవితం మనకు ఆదర్శప్రాయం. నిరాడంబరుడు, నిగర్వి అయిన ఆయన అందరి గుర్తింపు పొందకపోయినా, ఆయన చేసిన మంచిపనులు ఆయన గొప్పదనాన్ని చెప్పకనే చెబుతాయి. దురదృష్టవశాత్తూ క్యాన్సర్ వ్యాధి అతడిని కబళించినా, ధైర్యంగా నిలబడి, ఆనందంగా తలవంచిన ధీశాలి అతడు. చిట్ట చివరికి ఆయన పూర్తిచేయని పని అంటూ లేదు. బడుగు వర్గాల ప్రజల మనుగడకు ఆలవాలం అతనివంటి వారేనని మనోహర్ కృషి తెలుపుతుంది. ఈ సందర్భంగా 'జీవనోపాధులు' 'ఎస్.ఎస్. మనోహరన్' గారి జీవితాన్ని ఆవిష్కరించింది.

దొంతిల చంగర రచించిన 'లెట్ మీ స్పీక్' అన్న ప్రామాణిక గ్రంధం గురించి తప్పక చదవండి. 'క్షేత్రం'లో గూర్ఖాలాండ్ గురించి, 'సుక్షేత్రం'లో మత్స్యకారుల గురించి చెప్తుంది.

'లెజెండ్' అనుబంధం శ్రీ ఎస్ఆర్ శంకరన్‌ను గురించి చెప్తుంది. 'ఎలా' అనుబంధంలో ప్రొడ్యూసర్ కంపెనీని మొదలు పెట్టడం గురించి చెప్తుంది. ఎప్పుడూ ఇచ్చే ఈ-లింకులు 'రూరల్ లైవ్లీహుడ్ ఆప్షన్' అన్న వీడియో, 'హౌస్‌హోల్డ్ లైవ్లీహుడ్స్ ఇన్ సెమీ ఎరిడ్ రీజియన్స్' అన్న పుస్తకం, లీప్-రాఘవులపేట గ్రామం, విలువగొలుసు-తులసి, ఉపరంగం-మామిడి మరియు జీవనోపాధుల అభ్యాసన కోర్సు యొక్క 12వ సంచికలో 'అండర్‌స్టాండింగ్ సెల్ఫ్ & టీం మేనేజ్‌మెంట్' మీకు అందిస్తున్నాము.

ఒక 'జనహృదయాలలో ఎస్.ఎస్.మనోహరన్' గురించి కూడా తెలిపే ఈ సంచిక మీకు ఉపయుక్తంగా ఉండగలదని విశ్వసిస్తూ, ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాము.

మీ

'జీవనోపాధుల' టీం

**ఐక్యరాజ్య సమితి ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో 100 మిలియన్ల ప్రజలు మురికివాడలలో జీవిస్తున్నారు.**




**నేర్చుకోవడమనేది క్షేత్రస్థాయిలో ప్రజల పట్ల ప్రవర్తించే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది.**

**ఈ నెల జీవనోపాధులు, అనుబంధాలు, ఈ-కోర్సు**












జీవనోపాధులు ... ఛలఉదారం

ఎడిటర్ ఇన్ చీఫ్ : జి. మురళీధర్
సీనియర్ ఎడిటర్ : టి. వెంకటేశ్వర్లు
వర్కింగ్ ఎడిటర్ : యస్.లక్ష్మణ్
సంపాదక సాహచర్యం : వి. అరవింద్
: కె. కృష్ణ చైతన్య
: కె. రమేష్

**మాతో/మాదారిలో**

| | |
|---|---|
| ఎ. ఉమ | వి. మురళీధర్ |
| జి. జానకి | టి. నిర్మల |
| జి. దయానంద్ | సి. రమేష్ |
| వి. దీప్తి | ఎం. రవికృష్ణ |
| కె. భారతి | జి. రవిందర్ |
| బి. మధుసూదన్ | ఎం. లావణ్య |
| పి. మధుసూదన్ | ఎ. వెంకట రమణ |
| కె. మంజుల | కె. శ్రీదేవి |
| | ఎం. సుగుణశ్రీ |

**ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే**

**అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ALPL)**

**సహకారంతో**

Contact:
Mobile: 9885499297
web: www.aksharakriti.org,
www.livelihoods.net.in
e-mail: akshara@aksharakriti.org,
jeevanopadhulu@gmail.com

**చిరునామా**
C/o. Akshara Network
for Development Support Services
HIG - II, B-25, F - 6, APHB కాలనీ
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044

## ఈ సంచికలో...

**ప్రత్యేకం**

**ఫోకస్ : జనహృదయాలలో ఎస్.ఎస్.మనోహరన్** 10

ఈ సంవత్సరంలో ముఖ్యమైన సంఘటనలు 16
ఎ.వీరనారాయణం గ్రామం 17

నెలనెలా..

సంపాదకీయం 2

స్పందన మరియు న్యూస్ 4

క్షేత్రంలో – సంస్థ, పథకం/కార్యక్రమం, సదుపాయం 5

క్షేత్రం – గూర్ఖాలాండ 6

సుక్షేత్రం – మత్స్యకారులు 6

మథనం – మార్గం చూపిన మనోహరన్ ! 7

సంభాషణ – ఆమ్‌ఆద్మీ, కార్యకర్త, నిస్సహాయులు, నిస్సహాయులు 8

వ్యాపారం – వ్యక్తిగత, సమిష్టి, సామాజిక, ప్రజల 18

అభివృద్ధి సంస్థ – కమ్యూనిటీ ఆర్గనైజేషన్, సహాయక సంస్థ, శిక్షణా సంస్థలు 19

సందర్భం – భూసేకరణ, పునరావాస, పున:నిర్మాణ బిల్లు, 2011 20

జీవన తంత్రం – పాలలోని కప్పలు 22

పుస్తకాలు – క్లాసిక్ పుస్తకం: లెట్ మీ స్పీక్, 22

లేటెస్ట్ పుస్తకం: సస్టైనబుల్ లైవ్లీహుడ్స్

'యోగక్షేమం 23

**ఈ–వనరులు లింక్స్ :** LEAP (రాఘవుల పేట) 22
విలువ గొలుసు విశ్లేషణ: తులసీ
ఉపరంగం: మామిడీ
పుస్తకం: హౌస్‌హోల్డ్ లైవ్లీహుడ్స్ ఇన్ సెమీ ఎరిడ్
వీడియో: రూరల్ లైవ్లీహుడ్స్ ఆప్షన్స్

**ఈ–కోర్సు– క్యాప్సుల్ 12:** అండర్‌స్టాండింగ్ సెల్ఫ్ అండ్ టీం మేనేజ్‌మెంట్

'ఎలా' అనుబంధం: ప్రొడ్యూసర్ కంపెనీని ప్రారంభించడం
ఎందరో మహానుభావులు (అనుబంధం): ఎస్.ఆర్.శంకరన్

గమనిక: ఇందులో ప్రచురించిన రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని పత్రిక అభిప్రాయాలుగా భావించకూడదు.

## స్పందన




నవంబర్ నెలలో జీవనోపాధుల పత్రికలో సామాన్యుల ఆకాంక్షలు అనే సంచిక చాలా బాగుంది.

మాక రాజేందర్,
అడ్వకేట్
హైదరాబాద్



**లోక్‌పాల్ బిల్లు దేశంలోని అవినీతిని తగ్గించగలదా?**

## ➤➤ న్యూస్ ◀◀

**✠ 14,670 గ్రామాలకు ఆర్‌జీజీవివై:**

రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణ(ఆర్‌జీజీవివై) పథకాన్ని 14,670 గ్రామాలకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. నాలుగు విద్యుత్తు పంపిణీ సంస్థలు కలిసి పంపిన ప్రతిపాదనల ప్రకారం 10.24 లక్షల కుటుంబాలకు దీంతో లబ్ధి కలగనుంది.

**✠ మిల్లు వస్త్రాలకు ప్రత్యేక ముద్రలు:**

మరమగ్గాల, మిల్లుల్లో ఉత్పత్తి అయ్యే వస్త్రాలను గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక ముద్ర (పవర్ లూమ్ మార్క్) వేయాలని చేనేత రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. చేనేత వస్త్రాల ప్రత్యేకతను కాపాడాలని కమిటీ సూచించింది. మరమగ్గాల పోటీ కారణంగా చేనేత మనుగడ కష్టసాధ్యంగా మారడంతో ప్రభుత్వం 1985లో చేనేత రిజర్వేషన్ల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దాదాపు 11 రకాలను రిజర్వేషన్ల పరిధిలోకి తెచ్చింది. చేనేత వస్త్రాలను గుర్తించే విధంగా ప్రత్యేక ముద్ర (హ్యాండ్లూమ్ మార్క్)ను రూపొందించింది. ప్రతి వస్త్రంపై వీటిని ముద్రించాలని ఆదేశించింది.

**✠ ఈదురు గాలులను తట్టుకునే వరి వంగడం:**

తుఫాన్ల సమయంలో గంటకు 80కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచిన పడిపోకుండా నిలిచి ఉండే ఎంటియూ-1121 వరి వంగడాలను మార్టేరు వరి పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది. రానున్న ఏప్రిల్‌లో ఈ కొత్త వరి వంగడాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తామని ఆ సంస్థ ప్రకటించింది.

**✠ రూ.405కోట్ల పెట్టుబడి రాయితీ విడుదల:**

విపత్తులతో నష్టపోయిన రైతులకు రూ.405కోట్ల పెట్టుబడి రాయితీ విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువుతో దెబ్బతిన్న పంటలకు చెల్లించాల్సిన పెట్టుబడి రాయితీ బకాయిలను విడుదల చేశారు. 2011లో కరువు కారణంగా నష్టపోయిన రైతులకు రూ.129.99కోట్లు, 2012 కరువులో నష్టపోయిన రైతులకు రూ.279.14కోట్లు విడుదల చేశారు.

**✠ 'ఉపాధి'లో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రగామి:**

ఉపాధి హామీ పథకంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా కొనసాగుతోందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4152కోట్లు ఉపాధి హామీ ద్వారా చెల్లింపులు జరిగాయన్నారు. ఈ సంవత్సరం 55 లక్షల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించామన్నారు. నాలుగు లక్షల కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయన్నారు. ఉపాధి హామీ కనీస వేతనాన్ని రూ.149 నుండి రూ.218కి పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.



**✠ రాష్ట్రానికి నీరాంచల్ వాటర్‌షెడ్ పథకం:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్షాభావ ప్రాంతాలకు మరో భారీ వాటర్‌షెడ్ కార్యక్రమం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుంది. నీరాంచల్ జాతీయ వాటర్‌షెడ్ పేరిట కేంద్ర ప్రభుత్వం, ప్రపంచబ్యాంకు రుణంతో అమలయ్యే ఈ వాటర్‌షెడ్ కార్యక్రమానికి ప్రపంచబ్యాంకు ఆమోదముద్ర వేసింది. ఇప్పటి వరకూ అమలవుతున్న సమగ్ర వాటర్‌షెడ్ నిర్వహణ పథకం (ఐడబ్ల్యుఎంపి)కి అదనంగా నీరాంచల్ వాటర్‌షెడ్ కార్యక్రమానికి అమలు చేస్తారు. మహబూబ్‌నగర్, అనంతపురం సహా తక్కువ వర్షపాతం ఉన్న జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

(మూలం:ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ) ✸

క్షేత్రంలో

సంస్థ

# డోకూర్ గ్రామైక్య సంఘం



**డో**కూర్ గ్రామైక్య సంఘం (VO) మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని డోకూర్ గ్రామంలో 2004, అక్టోబర్ 21న ఏర్పడింది. 1995 MACS చట్టం కింద నమోదైన ఈ VO లో 35 స్వయం సహాయక బృందాలు సభ్యులుగా ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 4 వందల మంది సభ్యులతో 30 స్వయం సహాయక బృందాలు చురుకుగా పని చేస్తున్నాయి.

**ఈ గ్రామైక్య సంఘం కార్యవర్గ సభ్యులు:** అధ్యక్షురాలు – పడమటి లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి – సుగుణమ్మ, కోశాధికారి – లక్ష్మి.

ఈ గ్రామైక్య సంఘంలో ఒక బుక్‌కీపర్, ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్, ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు. వీరు ఆ గ్రామంలోని స్వయం సహాయక బృందాల సభ్యులతో కలిసి పని చేస్తారు. ఈ గ్రామైక్య సంఘంలో ప్రతి నెలా 11వ తేదీన సమావేశాన్ని నిర్వహిస్తుంది. ప్రతి నెలా VO లీడర్లు మండలస్థాయి సమావేశాలకు హాజరవుతారు. VO లీడర్ మండలస్థాయి సమావేశం వివరాలను VOల సమావేశంలో వెల్లడిస్తారు. ప్రస్తుతం ఈ సంస్థ వద్ద రూ.5,94,800 మూల నిధి ఉంది. ఈ VO సంఘ సభ్యులకు ఆరోగ్యం, పారిశుధ్యం మరియు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తుంది.

**సబ్ కమిటీలు:** ఈ సంస్థ 3 సబ్ కమిటీలను నెలకొల్పింది. 1. స్వయం సహాయక బృందాలు వివిధ బ్యాంకులతో లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా బ్యాంక్ లింకేజి కమిటీ 2. AWC పై పర్యవేక్షణ కమిటీ 3. స్వయం సహాయక బృందంలోని మహిళా సభ్యురాళ్ల సమస్యలపై ఒక కమిటీ. ఈ కమిటీలను గ్రామైక్య సంఘం కార్యవర్గ సభ్యులు పర్యవేక్షిస్తుంటారు. ✸

పథకం/కార్యక్రమం

## వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల పథకం (IHHL)



మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలంలోని డోకూర్ గ్రామ పంచాయతీలో వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల పథకం(IHHL)ను అమలు చేస్తున్నారు.

ఈ పథకాన్ని గ్రామంలో గత ఐదేళ్లుగా అమలు పరుస్తున్నారు. గ్రామంలో బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జనను నిర్మూలించడమే ఈ పథకం ఉద్దేశ్యం.

సర్వే ద్వారా గ్రామంలో మరుగుదొడ్లు లేని లబ్ధిదారులను గ్రామ పంచాయతీ గుర్తిస్తుంది. ఆ తర్వాత గ్రామ పంచాయతీలో ఆ లబ్ధిదారుల జాబితాను ఆమోదిస్తారు. ఆయా లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రతి కుటుంబానికి రూ.10 వేలు మంజూరు చేస్తారు.

దీనికి తోడు ఆయా లబ్ధిదారులకు కూలీ కింద MGNREGS నుంచి రూ.1,300 పొందుతారు. డోకూర్ గ్రామంలో ఈ విధంగా 60 మంది లబ్ధిదారులను గుర్తించారు.

గ్రామ పంచాయతీ ఇప్పటికే 96 మంది పేద లబ్ధిదారులకు ఈ విధంగా నగదును మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం గ్రామంలోని ఇతరులు కూడా ఈ విధంగా మరుగుదొడ్లు నిర్మించుకొనేలా ప్రోత్సహించడం జరుగుతోంది.

ప్రస్తుత వ్యవస్థలోని పారదర్శకత స్థానికులలో విశ్వాసాన్ని నెలకొల్పింది. అందువల్ల గ్రామంలోని ఇతరులు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ✸

సదుపాయం

## గ్రామీణ ఆరోగ్య పరిశోధనా సంస్థ (IRHS)

గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే ఆరోగ్య సమస్యలకు కారణాలను, వాటి లక్షణాలపై పరిశోధనలు చేపట్టడానికి డాక్టర్ ప్యాట్రీషియా బిడింగర్, శ్రీమతి భవానీ నాగ్ కలిసి 1982, ఫిబ్రవరిలో గ్రామీణ ఆరోగ్య పరిశోధనా సంస్థ (IRHS)ను స్థాపించారు. తమ ప్రాథమిక పరిశోధనలో వారు భారత గ్రామీణుల ఆరోగ్యం, పోషకాహారంపై వ్యవసాయ, సామాజిక-ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గురించి పరిశోధించారు.

IRHS ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ, పొడి వాతావరణం కలిగిన డోకూర్, కోటకద్రలలో చికిత్సాలయాలను నిర్వహిస్తోంది. ఈ రెండు గ్రామాలూ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నాయి. ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వల్ల కలిగే పోషకాహార లోపం, శారీరక శ్రమ వల్ల గ్రామీణుల్లో తరచుగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

గ్రామీణ మహిళల్లో స్త్రీల వ్యాధుల కొరకు పరీక్షలు; మహిళల సాధారణ ఆరోగ్య సమస్యల పరిశీలన, చికిత్స; పోషకాహారం, పునరుత్పత్తి వ్యవస్థలోని ఆరోగ్యకరమైన అలవాట్లపై విద్యాబోధన; గర్భధారణ, బాల్యావస్థలోని అన్ని దశలలో తల్లులతో కలిసి పని చేయడం; స్వచ్ఛందంగా ముందుకు వచ్చే డాక్టర్లతో కలిసి పని చేయడం, వారు పలు పరీక్షలు నిర్వహించేలా, రోగులకు చికిత్స నిర్వహించేలా, రోగుల నిర్వహణ చూసుకోవడంలో వారికి సహకరించడం ఈ సంస్థ చేసే పనులలో కొన్ని: బయటి వ్యక్తుల దృష్టి నుంచి చూసినట్లైతే, IRHS చికిత్సాలయాలలో చాలా మంచి అంశాలున్నాయి. వాటిలో స్థానికులే పని చేస్తారు. వీటిలో శిక్షణపై లోతుగా దృష్టి సారిస్తారు. కన్సల్టేషన్, ల్యాబ్ ఫీజుతో సహా ఇక్కడ కేవలం రెండు రూపాయలే వసూలు చేస్తారు. IRHSకు వివిధ పెద్ద హాస్పిటల్స్‌తో మెరుగైన సంబంధాలున్నాయి. దీని వల్ల రోగులకు అతితక్కువ (రూ.2/-) ఫీజుతోనే మంచి ఆరోగ్య సేవలు లభిస్తున్నాయి. ✸

# గూర్ఖాలాండ్

గూర్ఖాలాండ్‌కు పశ్చిమాన నేపాల్, ఉత్తరాన సిక్కిం, తూర్పున భూటాన్, దక్షిణాన ఒడిషాలున్నాయి. భౌగోళికంగా ఈ ప్రాంతం అత్యంత కీలకమైన ప్రదేశంలో ఉందని చెప్పవచ్చు. ఇక్కడ తీస్తా నది భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య ప్రవహిస్తోంది. ఈ నది ఉత్తర సిక్కిం నుంచి దక్షిణ బంగ్లాదేశ్ వైపునకు ప్రవహిస్తుంది. ఈ నది డార్జిలింగ్ జిల్లాను రెండుగా విభజిస్తుంది. డార్జిలింగ్ హిమాలయ ప్రాంతాల ఉత్తరభాగంలో ఉంది. మొత్తం భూభాగంలో 74% ఈ కొండలే ఆక్రమించి ఉన్నాయి. డార్జిలింగ్ జిల్లా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కేవలం 3.54శాతం మాత్రమే ఉంటుంది. ఇక్కడ ప్రధానంగా నాలుగు మతాలున్నాయి: హిందూ, నేపాలీ, బౌద్ధం, క్రైస్తవం. భాషలు: నేపాలీ, హిందీ, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు టిబెటన్.

ఇక్కడ ప్రధాన వ్యాపార పంటలు: తేయాకు, యాలకులు, అల్లం. గూర్ఖాలాండ్ ప్రజలు పశుపోషణ మీద కూడా ఆధారపడుతున్నారు. వారి ఇతర జీవనోపాధులు - వ్యవసాయ కూలీ, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, చిన్నచిన్న వ్యాపారాలు. వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు ప్రధానంగా ఉత్తర హిమాలయాలలోని పర్యావరణ, భౌగోళిక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి.




ఇక్కడ ఎక్కువమంది ప్రజలు, మరీ ముఖ్యంగా మహిళలు తేయాకు ఎస్టేట్‌ల మీద ఆధారపడుతున్నారు. క్లర్కులు తదితర చిన్న ఉద్యోగాలలో స్థానికులుండగా, మేనేజర్ పోస్టులను ఇక్కడికి వలస వచ్చిన వారు నిర్వహిస్తున్నారు. కూలీలను జార్ఖండ్, బీహార్, ఒడిషా రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటున్నారు. డార్జిలింగ్ తేయాకు తోటలలో ప్రస్తుతం ఆకులను తెంపే సమయం (వర్షాకాలం). ఇక్కడి తేయాకులో సుమారు 30-35 శాతం తేయాకు ఎగుమతి అవుతుంది. మొత్తం వార్షిక ఉత్పత్తిలో ఇది 15శాతం. ఇక్కడ ఏడాదిలో నాలుగుసార్లు తేయాకును తెంపుతారు. మొదటి సేకరణ, రెండో సేకరణ, వర్షాకాలం సేకరణ మరియు ఆకురాలు కాలం సేకరణ. డార్జిలింగ్‌లో మొత్తం 87 తేయాకు తోటలున్నాయి. వీటిలో సుమారు 50 వేల మంది కార్మికులు శాశ్వత ప్రాతిపదికన, 20 వేల మంది సీజనల్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఇక్కడి ప్రజలు కోళ్లు, పందులు, ఆవులు, మేకలు తదితర జంతువులను పెంచుకుంటారు. ఈ తేయాకు తోటలను స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిషర్లు అభివృద్ధి చేశారు. స్థానిక ప్రజలకు ఈ తేయాకు తోటలే ప్రధాన జీవనోపాధి.

ఇక్కడ సాధారణంగా ఏడాదికి 40 రోజులపాటు సమ్మె కారణంగా మార్కెట్లు మూసే ఉంటాయి. దీని వల్ల ఇక్కడి ప్రజలకు తరచుగా ఆహార సంక్షోభం ఏర్పడుతూ ఉంటుంది. 80వ దశకం తరువాత ఇక్కడి ప్రజల జీవితాలు బాగా దెబ్బ తిన్నాయి. సమ్మె వల్ల ఇక్కడి ప్రజలు తమ పాలను, వ్యాపార పంటలను అమ్ముకోలేకపోతున్నారు. ✸



# మత్స్యకారులు

మత్స్యరంగం దేశ ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతోంది. ఈ రంగం దేశంలోని సుమారు కోటి, 45 లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తూ, అనేక కోట్ల మందికి ఆహార భద్రత కల్పిస్తోంది. సుమారు 8 వేల కిలోమీటర్ల తీర ప్రాంతంతో, 20 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక విభాగం(EEZ)తో మన దేశం చేపలను ఉత్పత్తి చేసే దేశాలలో రెండో స్థానంలో ఉంది. మొత్తం ప్రపంచ చేపల ఉత్పత్తిలో మన దేశం వాటా 5.43శాతం ఉంది. దేశానికి ప్రధాన ఆదాయవనరుగా ఉండడంతో పాటు, ఇది అనేక మందికి ఉపాధి కల్పిస్తూ, ఎంతో మందికి ఆదాయాన్నిస్తోంది. ఈ రంగం మీద ఆధారపడి అనేక ఉపరంగాలు కూడా ఉన్నాయి.

దేశంలో దాదాపు 8.71 లక్షల హెక్టార్లను సాంకేతిక, పరిశుభ్రమైన, ఉప్పునీటి కయ్యలుగా మార్చి, వాటిని చేపల పెంపకానికి అనువుగా మార్చడం జరుగుతోంది. పరిశుభ్రమైన చేపల పెంపకం పథకంలాంటి మెరుగైన పద్ధతుల కింద దేశంలోని 14.17 లక్షల మంది చేపల పెంపకందారులు/మత్స్యకారులు లబ్ధి పొందుతున్నారు.

మత్స్యరంగంలో రెండు విభాగాలున్నాయి: వేట మరియు పెంపకం. చేపల వేటలో జాలరులు చేపలు సహజంగా జీవించే చెరువులు, నదులు, సముద్రాలలో చేపలను పడతారు. చేపలను పెంచడానికి వీరు ప్రత్యేంగా ఎలాంటి చర్యలనూ చేపట్టరు. చేపలు తమ సహజ పరిసరాలలో పెరుగుతుంటే, జాలరులు అక్కడికి తమ పడవలు, వలలు, గాలాలతో వెళ్లి వాటిని పట్టుకుంటారు. చేపల పెంపకం దీనికి భిన్నమైనది. ఇందులో చేపల పెంపకందారులు నీటి మడుగులలో చేపల గుడ్లను లేదా పిల్లలను వదులుతారు. ఆ తర్వాత నీటిలో వాటికి ఆహారం వేస్తారు. వివిధ వ్యాధుల నుంచి వాటిని పరిరక్షించడానికి ఆ నీటిలో పలు మందులను కలుపుతారు. నీటిని పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు మారుస్తుంటారు.

మన దేశంలోని చేపలు పట్టే జాతులు ఒకే రకంగా లేవు. వీరిలో అనేక రకాల కులాలకు చెందినవారు ఉన్నారు. వీరు నివసించే ప్రాంతాన్ని బట్టి ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలు, సంప్రదాయాలు, అలవాట్లు ఉంటాయి. ఆయా కులపరమైన వ్యవస్థలతో పాటు చేపలు పట్టే వారిలో అనేక వర్గాలు కూడా ఉన్నాయి. ఉదా: యాంత్రిక రంగంలో బోటు యజమానుల సంస్థ, ట్రేడ్ యూనియన్లు, సహకార సంఘాలు (ప్రభుత్వ, ప్రైవేటు రెండూ), చేపలు పట్టే విధానం (ఉదా: వలలు, గాలాలు మొ.వి), స్వయం సహాయక బృందాలు, సమాఖ్యలు మొదలైన వాటి ద్వారా వీరిని భిన్నంగా విభజించవచ్చు.

**జాతీయ జాలరుల సంక్షేమ పథకం: అ.** ఆదర్శ మత్స్యకారుల గ్రామాలను అభివృద్ధి చేయడం. **ఆ.** మత్స్యకారుల బృంద ప్రమాద బీమా **ఇ.** పొదుపు మరియు పునరావాసం **ఈ.** మత్స్యకారులకు శిక్షణ మరియ ఇతర సహాయం

**ముగింపు:** దేశంలో చేపల ఉత్పత్తికి ఉన్న అవకాశాలలో మనం కనీసం 30 శాతాన్ని కూడా ఉపయోగించుకోవడం లేదు. ఈ రంగంపై ఆధారపడిన అనేక లక్షల మంది జీవనోపాధులను మెరుగుపరిచే అవకాశం ఉంది. అనేక పౌర సామాజిక బృందాలు మత్స్యకారుల జీవనోపాధులను ఎలా మెరుగుపరచవచ్చునో, పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగకుండా చేపల ఉత్పత్తిని ఎలా పెంచవచ్చునో, చేపల ఉత్పత్తులకు ఎలా అదనపు ఉత్పత్తిని జోడించవచ్చునో ఉదాహరణలతో సహా నిరూపించి చూపాయి. వాటన్నిటినీ మత్స్యకారులు ఉపయోగించుకుంటే వారికి ఎంతో ఉపయోగం. ✸

# మార్గం చూపిన మనోహరన్!

చలి తీవ్రమైంది. తెలంగాణా బిల్లు ఆమోదం కొరకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టబడింది; ఇంకా ఈ ప్రక్రియ నడుస్తూనే ఉంది!

ఆమ్ ఆద్మీ పార్టీకి మెజారిటీ లేకపోయినా అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పరిణామక్రమంలో ఒక సరికొత్త నమూనా ఆవిష్కృతమైంది! లక్షలాదిమంది AAP లో కార్యకర్తలుగా చేరుతున్నారు. విరాళాలు వచ్చి చేరుతున్నాయి. ఈసారి వచ్చే సార్వత్రిక ఎన్నికలు ఆసక్తికరంగా ఉండగలవు. సాంప్రదాయ పార్టీలకు కష్టకాలం అనే చెప్పాలి.

లోక్‌పాల్ బిల్లు చట్టం అయ్యింది.

వీటన్నింటి మధ్యనా, మనం శ్రీ SS మనోహరన్ గారిని మరవద్దు. మనోహరన్ నా సహాధ్యాయి, ఆప్త మిత్రుడు, సహచరుడు మరియు సాటి అభివృద్ధి కార్యకర్త.

మనోహరన్ (1956-2011) 1987లో ఇర్మా సంస్థలో రూరల్ డెవలప్‌మెంట్ లో పి.జి డిప్లొమొ చెయ్యడానికి వచ్చారు. అంతకు ముందు ఆయన కోయంబత్తూర్‌లో ఇంజనీరింగ్ చదివారు. ఇర్మాలో చదువు పూర్తి చేశాక మేమిద్దరం నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు(NDDB)లో డా॥ కురియన్ మరియు డా॥ అనేజా నేతృత్వం వహించిన నూనెగింజల మార్కెటింగ్ ఇంటర్‌వెన్షన్ ఆపరేషన్ యొక్క ప్రధాన జట్టులో చేరాము. ఈ ఆపరేషన్ యొక్క లక్ష్యం ఏమిటంటే, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా, వినియోగదారులకు అందుబాటు ధరలో సరుకు లభ్యమయ్యేలా, తినడానికి పనికివచ్చే నూనె గింజలు/నూనెల ధరలను దేశమంతటా ఒకే విధంగా స్థిరీకరించడం.

మనో మరియు మా ఇంకో సహచరుడు TS రాజన్ ఒక పెద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరూ కోమాలోకి జారిపోగా మనో ఓ రెండు రోజులకు కోలుకున్నాడు కానీ, రాజన్ కోలుకోలేకపోయాడు. ఆ షాకు నుండి, దు:ఖం నుండి తేరుకోవడానికి మనోకు చాలా కాలం పట్టింది. ఈ సంఘటన మనో మీద ఎంతో ప్రభావాన్ని చూపింది.

ఈ సంఘటన కారణంగా, మరియు అట్టడుగు వర్గాలతో కలిసి పనిచెయ్యాలన్న మా అంతరాత్మ ప్రబోధం వలన, మెల్లగా మేము విశాఖపట్టణంలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పోరేషన్(GCC)లో చేరాలని నిర్ణయించుకున్నాము. ముందుగా మనోను వెళ్ళనివ్వడానికి NDDB అంగీకరించింది. అతడు విశాఖపట్నం జిల్లా, పాడేరు డివిజన్, గంగరాజు మాడుగుల మండలంలోని బౌధిలి గ్రామంలో పనిచేయడం మొదలు పెట్టాడు. ఆ తరువాత నేను GCCలో చేరి మందు ఆదిలాబాద్ లో పనిచేసి తరువాత విశాఖపట్నంలో పనిచేశాను. ముందుగా అనుకున్నట్లుగా మనో మూడు సంవత్సరాలపాటు అక్కడ పనిచేసి, అక్కడి గిరిజనులలో మరియు అతని సహచరులలో చెరగని ముద్ర వేశాడు. మంచి మంచి సంస్థల నుండి వచ్చిన 25 కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లకు దేశంలోని గిరిజన ప్రాంతాలలో పనిచెయ్యడానికి తర్ఫీదునిచ్చి అతను వారికి మార్గదర్శి అయ్యాడు.

అతను తన తండ్రిగారి సేంద్రీయ ఎరువులు, పురుగుమందుల వ్యాపారంలో చేరాడు కానీ ఎక్కువ కాలం అక్కడ ఉండలేక, 1991లో తమిళనాడులో నీలగిరిలోని గుడలూర్‌లోని గిరిజనులతో కలిసి పనిచెయ్యడానికి ACCORD సంస్థలో చేరాడు. కాలెయ క్యాన్సర్ బారిన పడి అతని తుది శ్వాస విడిచేవరకూ అంటే దాదాపు 16 సంవత్సరాలపైన ACCORDలోనే పనిచేశాడు. ACCORD సంస్థాపకులు స్టాన్ మరియు మేరీ థకాకెరెలతో బాటూ డైరెక్టర్‌గా సంస్థకు నేతృత్వం వహించాడు. ACCORD సంస్థ ఆరోగ్యం, విద్య మరియు జీవనోపాధుల రంగాలలో పనిచేస్తుంది. ఆదివాసీ ఆసుపత్రి, ఆదివాసీ మున్నేట్ర సంఘం (గిరిజన మార్కెట్ సంఘం) మరియు విద్యోదయ పాఠశాలలో మనో ముద్ర కనిపిస్తుంది. మనో మౌనంగా అక్కడ సుస్థిరమైన, అవసరమైన వనరులను వాటికవే కూర్చుకోగల శక్తిని అందించే వ్యవస్థలను, యంత్రాంగాలను నెలకొల్పాడు.

అతడు చివరిసారిగా తీసుకున్న నెలకు వేతనం కేవలం రూ.8000/- మాత్రమే. అతడు చాలా సామాన్యమైన జీవితాన్ని గడిపాడు. కానీ చాలా అసామాన్యమైన రీతిలో అనేకమంది జీవితాలలో, ఎన్నో విధాలుగా ఎంతో గాఢమైన ప్రయత్నంతో మార్పును తీసుకొచ్చాడు. అతను తన తోటి ఉద్యోగి అయిన దుర్గను పెళ్ళిచేసుకున్నాడు. వెన్నెల అను ఓ పాపను దత్తత తీసుకున్నాడు. అభివృద్ధి సాధువుగా పేరు గాంచిన ఋషి మనో - తన జీవితంలో అన్ని విధాలా నిరాడంబరతను పాటించాడు. కేవలం గుడలూరుకే అంకితమైపోవడం అతనికి ఎంతో నచ్చిన విషయం. అతడు క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పుడు, గుడలూర్‌లోని మరియు ఇతర ప్రదేశాలలోని వేలాదిమంది అతనికోసం ప్రార్థించారు. అయితే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ప్రకృతి ఒడిలో జీవించిన అతనికి క్యాన్సర్ రావడం అన్నది ఎవరికి అంతుచిక్కని విషయం. చెయ్యవలసినవి ఏమైనా మిగిలి ఉన్నాయా అని నేను అడిగినప్పుడు తాను చెయ్యదలచుకున్నవన్నీ చేసేసాననీ, ఇంక తాను చెయ్యాలనుకున్నవేవి లేవని జవాబిచ్చాడు. వెన్నెల చూస్తుండగా, దుర్గ ఒడిలో అతడు తుది శ్వాస విడిచాడు.

నా వరకూ, అతడు ప్రజలు ఎరగని ఒక మహా మనిషి. అతడు తన జీవితాన్ని సఫలం చేసుకున్నాడు. ఎన్నో విధాలుగా ప్రభావం చూపిన అతడు అభివృద్ధి కార్యకర్తలందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచి ఉంటాడు. తన గిరిజనుల హృదయాలలో ఎప్పటికీ 'అన్న'గా నిలిచిపోతాడు. డా॥ కురియన్ అన్నట్లుగా ఇర్మా బ్యాచిల్లో ఉండే ఇద్దరు-ముగ్గురు అసలైన ఆజన్మాంత గ్రామీణ నిర్వహణా కార్యకర్తలకు అతడు నిదర్శనంగా మిగిలిపోతాడు.

మనం ఒక 6000 మంది మనోహరన్లకు తయారుచెయ్యగలమా, మండలం/ బ్లాకుకు ఒకరిని కానీ, ప్రతి 600 మందికీ ఒకరిని కానీ, జిల్లాకు ఒకరిని కానీ లేదా 100 మందికి ఒకరిని కానీ, లేదా రాష్ట్రానికి ఇద్దరు, ముగ్గురిని? మనం అటువంటి వారిని గుర్తించాలి. శిక్షణ ఇవ్వాలి, మార్గదర్శకత్వం అందించాలి, తగిన ప్రదేశాలలో వారిని నియమించాలి. మనం వారికి తగిన పారితోషికం కూడా ఇవ్వాలి. ఈ పని మన PMRDFలు, యంగ్ ప్రొఫెషనల్స్ చెయ్యగలరా? మన అభివృద్ధి సంస్థల మరియు ప్రజా సంస్థల CEOలు చెయ్యగలరా? చెయ్యలేమా?

మనోహరన్ వంటివారికి అంకితం ఇచ్చేందుకు మనం ఒకటి రెండు సంస్థలను తయారుచేద్దాం. తక్కిన వాటిని వారే చూసుకుంటారు.

**జి. మురళీధర్** ✷



**డిసెంబర్ 7**

**అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం**

ఆమ్ ఆద్మీ సంభాషణ

## వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకుంటున్నాను



**మీ పేరేమిటి? మీ వయసెంత?**

నా పేరు దాచేపల్లి అప్పలరాజు. నాకు 48 ఏళ్లు.

**మీ విద్యార్హతల గురించి చెప్పండి?**

నేను మూడో తరగతి వరకూ చదువుకున్నాను.

**ప్రస్తుతం మీరేం పని చేస్తున్నారు?**

నేను హైదరాబాద్‌లో మొబైల్ ఫుడ్ సెంటర్‌ను నడుపుతున్నాను.

**మీ కుటుంబం గురించి చెప్పండి?**

మా కుటుంబంలో ఐదుగురు సభ్యులున్నారు. నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు, మా అమ్మ. మేమంతా ఒకే ఇంటిలో కలిసి నివసిస్తున్నాం. మేం 12 ఏళ్ల క్రితం అన్నవరం నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చాం.

**మీ స్వగ్రామమేది?**

మా సొంతూరు తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సమీపంలోని కాచరాజువారి పాలెం.

**మీరు ఎన్నేళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారు?**

నేను 2008 నుంచి ఇదే పనిలో ఉన్నాను.

**మీరెలాంటి టిఫిన్లు తయారు చేస్తారు? రోజుకెంత ఆదాయం వస్తుంది?**

నేను ఇడ్లీ, దోశ, మైసూర్ బోండ అమ్ముతాను. దీని ధర ప్లేటు పది రూపాయలు. ఈ వ్యాపారంలో నేను రోజుకు రూ.300-400 వరకూ సంపాదిస్తున్నాను.

**మీ కొడుకు ఎంత సంపాదిస్తున్నాడు.**

నా కొడుకు కూడా ఇదే వ్యాపారంలో ఉన్నాడు. వాడు రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకూ సంపాదిస్తాడు.

**మీరు టిఫిన్లను ఎక్కడ విక్రయిస్తారు?**

నేను ఎల్‌బీ నగర్, ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక, ఉస్మానియా యూనివర్సిటీ పరిసర ప్రాంతాలలో విక్రయిస్తాను.

**మీరు ప్రభుత్వం ద్వారా ఏమైనా లబ్ధి పొందినారా?**

నాకు అక్కడ ఒక ఇల్లుంది. నేను రేషన్ కార్డు ద్వారా పలు పథకాల్లో లబ్ధి పొందాను. మా అమ్మకు కూడా ప్రభుత్వం నుంచి పింఛన్ వస్తోంది.

**మీరు హైదరాబాద్‌లో ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు?**

నాకు ఇక్కడ రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు లాంటివి ఏవి లేవు. ఇక్కడ అతి పెద్ద సమస్య ఏమిటంటే, నాకంటూ ఇక్కడ సొంతిల్లు లేదు. దీనికి తోడు, నా వ్యాపారానికి లైసెన్సు లేదు. దీని వల్ల నేను ట్రాఫిక్ పోలీసుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నాను. ప్రతి రోజూ నేను పోలీసులకు వంద రూపాయలు కట్టాల్సి వస్తోంది.

**మీ భవిష్యత్తు ప్రణాళికలేమిటి?**

నా వ్యాపారాన్ని మరింత మెరుగుపరచుకుని, హైదరాబాద్‌లో సొంతిల్లు నిర్మించుకోవాలనుకుంటున్నాను. ✸

క్షేత్రస్థాయి కార్యకర్త సంభాషణ

## పేదలకు సేవ చేయాలనుకుంటున్నాను...



**మీ పేరేమిటి? మీ వయసెంత?**

నా పేరు ఎం.డి. ఇనాయత్ ఆగా. నాకు 29 ఏళ్లు.

**మీ విద్యార్హతల గురించి చెప్పండి.**

నేను సికింద్రాబాద్ పీజీ కాలేజి నుంచి MSW పూర్తి చేసాను.

**మీ స్వగ్రామమేది? మీ కుటుంబం గురించి చెప్పండి.**

మాది నల్గొండ పట్టణం. మా కుటుంబంలో ఆరుగురు సభ్యులున్నాం. నా భార్య ఇంటి పట్టునే ఉంటుంది. మా నాన్న రిటైర్డ్ టీచర్. అమ్మ కూడా ఇంటి పట్టునే ఉంటుంది. నా సోదరుడు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. వదిన ఇంటి వద్ద ఉంటుంది.

**ప్రస్తుతం మీరేం పని చేస్తున్నారు?**

నేను నల్గొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సోషల్ వర్కర్‌గా పని చేస్తున్నాను.

**మీరు ఎన్నేళ్లుగా ఈ వృత్తిలో ఉన్నారు?**

నేను 2012, ఆగస్టు నుంచి ఈ ఆసుపత్రిలో పని చేస్తున్నాను. ఇది 0-5 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు పోషకాహార పునరావాస కేంద్రం. నా పనిలో నేను ప్రధానంగా పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారిపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఉదా: చిన్న పిల్లలు, పాలిచ్చే తల్లులు, గర్భిణులు. పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలను నివారించడానికి నేను వారందరికీ ఆహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు ఇస్తుంటాను. యువతులలో అవగాహన పెంచడం కోసం 60 రోజుల కాలవ్యవధి గల పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడతాము.

**మీ కార్యక్రమం గురించి మరిన్ని వివరాలు చెప్పండి?**

మా కార్యక్రమం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (NRHM) కిందకు వస్తుంది. మేము 0-5 ఏళ్ల మధ్య వయసున్న జబ్బు పడి, పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తిస్తాము. మేము గర్భిణులు కోసం కూడా పని చేస్తాం. శిశుమరణాలను అరికడతాము. గర్భస్థ శిశు మరణాలను నివారణకు కృషి చేస్తాం. శిశువుల మృతి రేటును తగ్గించేందుకు ప్రయత్నిస్తాం.

**ప్రతి నెలా ఎంత మంది రోగులు మీ వద్ద నమోదు చేసుకుంటారు?**

మా ఆసుపత్రిలో ఈ పథకం కింద ప్రతి నెలా 15 నుంచి 20 మంది పిల్లల పేర్లు నమోదు చేసుకుంటారు. ఈ కార్యక్రమం యొక్క సూపరింటెండెంట్ ఆయా నమోదు వివరాలను పర్యవేక్షిస్తారు. ప్రాజెక్టు మార్గదర్శకాలను ఆయన రూపొందిస్తారు.

**గ్రామస్థాయిలో మీరు ఎలా సహాయపడతారు?**

మారుమూల గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ANMలు, సబ్ PHCలు, PHCలు పౌష్టికాహార లోపంతో బాధపడేవారిని మాకు రెఫర్ చేస్తారు. అక్కడి నుంచి మేం వారియొక్క సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి ప్రయత్నిస్తాం.

**మీ ఉద్యోగంలో మీరేవైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? మీ భవిష్యత్ ప్రణాళికలేమిటి?**

ఈ ఉద్యోగంలో నాకెలాంటి సమస్యలూ లేవు. అవసరంలో ఉన్న ప్రజలకు సేవ చేయడంలో నేను తృప్తిని పొందుతున్నాను. నాకున్న ఒకే ఒక కోరిక, నేను ఇదే రంగంలో మరింత ఉన్నత స్థానాన్ని పొంది, ప్రస్తుతం నేను తీసుకుంటున్న జీతం కంటే ఎక్కువ జీతం పొందాలి. ✸

## నేను పోలీసుని కావాలనుకుంటున్నాను...

**నీ పేరేమిటి? నీ వయసు? నీ కుటుంబం గురించి చెప్పు?**



నా పేరు యెడ్ల ప్రకాశ్. నాకు 14 ఏళ్ళు. మా కుటుంబంలో నేను, అమ్మ, నాన్న మరియు తమ్ముడు ఉంటాము.

**నువ్వు ఏం చదువుతున్నావు?**

ప్రస్తుతం నేను హైదరాబాద్‌లోని వారాసిగూడలో ఉన్న అమరావతి గ్రామర్ స్కూల్‌లో చదువుకుంటున్నాను. మిగతా సమయంలో నేను ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో టీ, ఇతర ఆహార పదార్థాలను అమ్ముతాను.

**మీ స్వస్థలమేది?**

మా సొంతూరు తూర్పు గోదావరి జిల్లాలోని అన్నవరం. మా కుటుంబం పన్నెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చింది.

**నువ్వు టీ ఎందుకు అమ్ముతున్నావ్?**

నేను టీని, టిఫిన్లను అమ్మిన డబ్బుతో నా స్కూల్ ఫీజు కట్టుకుంటున్నాను. దీని వల్ల నా కుటుంబానికి తోడ్పడినట్లవుతుంది. మా నాన్న ఓ తాగుబోతు. ఆయన తాగుడుకు చాలా అప్పులు చేసాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం చాలా విషమంగా ఉంది. దీని వల్ల మా కుటుంబానికి డబ్బు అవసరం చాలా ఉంది. అందువల్లే ఇలాంటి చిన్న చిన్న పనులు చేయడం మా కుటుంబానికి చాలా అవసరం. నేను ఉదయం 5 గంటలకే నిద్ర లేచి, టిఫిన్లను తీసుకుని ఉదయం 8 గంటల వరకూ మాణికేశ్వరనగర్ మెయిన్ రోడ్డు మీద విక్రయిస్తాను. ఇంటికి తిరిగి వచ్చి, రెడీ అయి స్కూలుకు 9 గంటలకు స్కూలుకు వెళతాను. తిరిగి 5 గంటలకు స్కూలు నుంచి ఇంటికి వస్తాను. ఆ తర్వాత క్యాంపస్‌లో టీ అమ్ముతాను ఒకో కప్పు ధర 5 రూపాయలు. నేను రోజుకు వంద రూపాయల వరకూ సంపాదిస్తాను. సెలవు రోజుల్లో అయితే నా ఆదాయం ఇంకా ఎక్కువే ఉంటుంది.

**నువ్వు ఏ సమయంలో చదువుకుంటావు? ఈ పనిని ఎప్పటి నుండి చేస్తున్నావు?**

నేను సాధారణంగా రాత్రి వేళల్లో చదువుకుని, హోమ్‌వర్క్ చేసుకుంటాను. పరీక్షలకు ప్రిపేర్ అవుతాను. రాత్రి 9 గంటలకు మొదలుపెట్టి వీలైనంత ఎక్కువ సేపు చదువుతాను. గత రెండేళ్లుగా ఈ పనిని చేస్తున్నాను.

**మీరు హైదరాబాద్‌లో ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు?**

ఈ పట్టణంలో నాకు ఆధార్ కార్డు లేదు. నా చదువుకు తగినంత సమయాన్ని వెచ్చించలేకపోతున్నానని కూడా నాకు బాధగా ఉంది.

**భవిష్యత్తులో నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు?**

నేను ఓ పోలిసాఫీసర్‌ను కావాలనుకుంటున్నాను. మా బంధువుల్లో ఒకరు పోలీస్ కానిస్టేబుల్‌గా ఉన్నారు. ఆయనను చూసి నేను చాలా ప్రేరణ పొందాను. నేను కూడా ఆయన అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నాను. నేను చాలా బాగా చదువుతున్నాను. 8వ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుంటున్నా. 8 పూర్తయ్యాక నేను మా స్కూలు నిర్వాహకులతో మాట్లాడి 9 చదవకుండా సరాసరి పదో తరగతిలో చేరాలనుకుంటున్నాను. ✸

నిస్సహాయుల సంభాషణ

## ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాను...

**నీ పేరేమిటి? నీ వయస్సెంత? మీ కుటుంబం గురించి చెప్పండి?**



నా పేరు కేలపు నరసింహ. నాకు 61 సంవత్సరాలు. మా కుటుంబంలో నేను, నా భార్య, ఇద్దరు కూతుర్లు ఉంటాము.

**మీ వృత్తేమిటి?**

నేను హైదరాబాద్‌లోని తార్నాక సమీపంలో ఒక మంగలిషాపును నిర్వహిస్తుంటాను.

**మీ కుటుంబ సభ్యులు ఏం చేస్తుంటారు?**

నా భార్య తార్నాక, వారాసిగూడల్లో పని మనిషిగా పని చేస్తుంది. నా పెద్ద కూతురుకు పెళ్లయి పోయింది. చిన్న కూతురు మొన్ననే 10వ తరగతి పూర్తి చేసింది. ప్రస్తుతం నా చిన్న కూతురు ఇంటి పట్టునే ఉంటుంది. నాకో తమ్ముడు కూడా ఉన్నాడు. అమ్మ చిన్నప్పుడే చనిపోవడంతో వాడిని వేరేవాళ్లకు దత్తత ఇచ్చారు.

**మీ స్వస్థలమేది?**

మా ఊరు వరంగల్ జిల్లా, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని గూడూరు.

**మీరు హైదరాబాద్‌లో ఎక్కడ ఉంటున్నారు?**

నేను హబ్సిగూడ సమీపంలో ఉస్మానియా క్యాంపస్‌లో ఉంటున్నాను.

**మీరు రోజుకు ఎంత సంపాదిస్తారు?**

నేను రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకూ సంపాదిస్తాను. నేను కటింగ్ మరియు షేవింగ్‌కు 40 రూపాయలు తీసుకుంటాను.

**మీ షాపు ఎక్కడ ఉంది?**

నా షాపు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ పరిసరాల్లోనే ఉంది.

**మీకు ఏవైనా ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి కలిగిందా?**

నాకు రేషన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్ కార్డు ఉన్నాయి. కానీ నా కుటుంబానికి రేషన్ సరిపోవడం లేదు. ప్రభుత్వం పేదలకిచ్చే బియ్యం పరిమాణం పెంచాలని నేను కోరుతున్నాను. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం మా కుటుంబానికంతటికీ సరిపోవడం లేదు.

**నిత్య జీవితంలో మీరు ఏమైన సమస్యలు ఎదుర్కొంటున్నారా?**

నాకు గ్యాస్ కనెక్షన్ లేదు. ప్రభుత్వం నుంచి నాకు పింఛన్ లభించడం లేదు. అంతే కాకుండా నా ప్రధాన సమస్య – మాకు సొంతిల్లు లేదు. వృద్ధాప్యంలో నన్ను చూసుకోవడానికి ఎవరూ లేరు. నాకు హై బీపీలాంటి ఆరోగ్య సమస్యలున్నాయి. నేను చెకప్ కోసం ఉప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళలేకపోతున్నాను. అక్కడికి పోతే వాళ్లు బోలెడన్ని మందులు రాసిస్తారు. వాటన్నిటినీ నేను కొనుక్కోలేను. ఈ ముసలితనం చాలా దుర్భరమైనది.

**మీ భవిష్యత్ ప్రణాళికలేమిటి?**

నా రెండో బిడ్డను ఒక మంచి యువకునికిచ్చి పెళ్లి చేయాలనుకుంటున్నాను. నా షాపును పెద్దగా చేయాలని, మరింత ఎక్కువ మంది కస్టమర్లు నా షాపుకు రావాలని కోరుకుంటున్నాను. అంతే కాకుండా ఈ వయసులో పని చేయలేకపోతున్నాను. అయితే ఇప్పుడు పని మానుకుంటే ఇల్లు గడవదని బలవంతంగా ఈ పనిని చేస్తున్నాను. ✸

ఫోకస్

# జనహృదయాలలో ఎస్.ఎస్. మనోహరన్

***సిన్నయ్య శ్రీనివాసన్ (ఎస్.ఎస్) మనోహరన్ 2012, ఫిబ్రవరిలో తమిళనాడులోని కడలూర్‌లో క్యాన్సర్ వ్యాధితో మరణించాడు. అతని జీవితం, చేసిన పనులు నీలగిరి కొండల్లోని అనేక వేల మంది గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపాయి. స్థానికుల జీవితాలను మెరుగుపరచడానికి అతను అలుపెరుగని కృషి చేసాడు. గుడలూర్ ACCORDలో, వేలాది మంది జీవితాలలో అతని అకాల మరణం ఒక పూడ్చలేని లోటును సృష్టించింది. ఈ వ్యాసం అతని జీవితం, అతను చేసిన కృషి, మంచి పనులకు ఒక నివాళి.***





ఎస్.ఎస్.మనోహరన్ 2012, ఫిబ్రవరిలో తమిళనాడులోని కడలూర్‌లో క్యాన్సర్ వ్యాధితో మరణించాడు. అతని జీవితం, చేసిన పనులు నీలగిరి కొండల్లోని అనేక వేల మంది గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపాయి. స్థానికుల జీవితాలను మెరుగు పరచడానికి అతను అలుపెరుగని కృషి చేసాడు. గుడలూర్ ACCORDలో, వేలాది మంది జీవితాలలో అతని అకాల మరణం ఒక పూడ్చలేని లోటును సృష్టించింది.

ఎస్.ఎస్.మనోహరన్ తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలో 1966, డిసెంబర్ 1న జన్మించాడు. ఆయన తాతగారు ఒక రైతు. మనోహరన్ తండ్రి ఎస్.శ్రీనివాసన్ వారి కుటుంబంలో మొట్టమొదటి విద్యార్థికుడు, వేతనాన్ని అందుకున్న ఉద్యోగి. ఆయన తంజావూరు జిల్లాలో జిల్లా వ్యవసాయాధికారిగా పని చేసారు. మనోహరన్ తల్లి తరపు తాతగారు తమిళంలో మంచి కవి.

మనోహరన్ తిరుచ్చిలోని ఓ పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. ఆ పాఠశాలలో ఐదో తరగతి వరకూ చదివాక, తండ్రి అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ కావడంతో, మనోహరన్ ఆ తర్వాత పలు పాఠశాలలు మారాల్సి వచ్చింది. 5వ తరగతి పూర్తి చేసాక, వారి కుటుంబం పుదుక్కోట్టైకు వెళ్లింది. అక్కడ వాళ్లు రెండేళ్లున్నారు. మనోహరన్ విద్యాభ్యాసంలోని చివరి అధ్యాయం పత్తుక్కోట్టైలో ముగిసింది. 11, 12వ తరగతులు మినహా మిగతా చదువంతా మనోహరన్ తమిళ మాధ్యమంలోనే చదివాడు. పాఠశాలలో తెలివైన విద్యార్థులలో ఒకడిగా పేరు తెచ్చుకున్న మనోహరన్... పాఠశాలలో ఎప్పుడూ ఒకటో, రెండో స్థానంలో ఉండేవాడు. 12వ తరగతి పరీక్షల్లో మనోహరన్ తంజావూరు జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచాడు.

యుక్త వయస్సు నుంచీ మనోహరన్ పుస్తకాలు చదవడంలో చాలా ఆసక్తి కనబరిచేవాడు. ప్రఖ్యాత తమిళ రచయిత సుజాత పుస్తకాలను అతను ఎంతో ఇష్టంగా చదివేవాడు. సుజాత అనేది ఎస్.రంగరాజన్ అనే రచయిత కలం పేరు. ఎలెక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తయారు చేయడంలో కూడా రంగరాజన్ చాలా ప్రాముఖ్యత పొందారు. తన భార్య పేరు సుజాతను ఆయన తన కలం పేరుగా మార్చుకున్నారు. సుజాత సైన్సు సంబంధిత విషయాలపై విస్తృతంగా రచనలు చేశారు. ఇవి సాధారణంగా కథల రూపంలో, అప్పుడప్పుడూ నవలల రూపంలో వచ్చేవి. మనోహరన్ చిన్నతనంలో దర్శకుడు బాలచందర్ ప్రభావం కూడా చాలా ఎక్కువగా ఉండేది.

1983లో మనోహరన్ ఇంజనీరింగ్ చదివేందుకు కోయంబత్తూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(CIT)లో చేరాడు. వాటితో పాటు అతను ఎమ్‌బీబీఎస్, వ్యవసాయ కోర్సులకు కూడా అప్లై చేసుకున్నాడు. కానీ చివరికి అతను ఇంజనీరింగే చదవాలని నిర్ణయించుకున్నాడు. సీఐటీలో మనోహరన్ సమయమంతా సినిమాలు చూడ్డంలోనూ, పుస్తకాలను చదవడంలోనూ, సరికొత్త స్నేహితులను (ఇవే జీవితాంతం నిలిచి పోయాయి) ఏర్పరచుకోవడంలో గడిపేసాడు. CITలోనే అతనికన్నా మూడేళ్ల సీనియరైన అతనికి మామ వరుస అయ్యే కలై ఉండేవాడు. చదువులో ముందంజలో ఉండే మనోహరన్, ఇంజనీరింగ్‌లో కూడా అదే విధంగా పురోగమించాడు. అతను తన బ్యాచ్‌లో ఎప్పుడూ రెండో స్థానంలో వచ్చేవాడు. చదువును, ఇతర ఆసక్తులనూ ఒకేసారి కొనసాగించే మనోహరన్ సామర్థ్యాలను గురించి అతని సహాధ్యాయులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. సినిమాలు, పుస్తకాలపై మనోహరన్‌కున్న పట్టు అతనికి కళాశాల జీవితంలో ఇద్దరు మరపురాని స్నేహితులను సంపాదించి పెట్టేలా చేసింది. మనోహరన్ అతని స్నేహితులు షణ్ముగం, హరి విసుగూ విరామం లేకుండా అప్పుడే వచ్చిన సినిమాలు, చదివిన పుస్తకాల గురించి ఎడతెగకుండా చర్చించుకునేవారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత మనోహరన్ మేనేజ్‌మెంట్ చేయడానికి ఆసక్తి కనబరిచాడు. కానీ, ప్రత్యేకంగా ఎక్కడ చదవాలనే విషయంపై మాత్రం నిర్ణయించు కోలేకపోయాడు. అయితే అతనెన్నడూ గ్రామీణ మేనేజ్‌మెంట్‌ను చదవాలనుకున్న విషయాన్ని మాత్రం ఎక్కడా చెప్పలేదు. తాను దరఖాస్తు చేసుకున్న కళాశాలల గురించి అతను తన కుటుంబానికి కానీ, స్నేహితులకు కానీ ఎన్నడూ చెప్పలేదు.



IRMA నుంచి సీటు వచ్చినట్లు ఖరారైన తర్వాత మాత్రమే అతను ఎప్పుడూ తనను ప్రోత్సహించే తన తల్లిదండ్రులకు ఆ సంగతి వెల్లడించాడు. IRMAలో మనోహరన్‌కు అంతకు ముందెన్నడూ తాను చూడని వాతావరణం కనిపించింది. CITలో ఉండే ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు అక్కడ ఉండేవి కావు. అది అతనికి



పూర్తిగా కొత్త, తాను అంతకు ముందెన్నడూ ఎరుగని వాతావరణం. మాతృభాషలో చదివి అక్కడికి వచ్చిన అనేక మంది గ్రామీణ విద్యార్థులలో మనోహరన్ ఒకడు. ఇంగ్లీష్ మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు అతనితో వెంటనే స్నేహం చేయడానికి అంత ఇష్టం చూపలేదు. అతను ఇంగ్లీష్‌ను వేగంగా, అందరి ఎదుటా ధైర్యంగా మాట్లాడలేకపోయేవాడు. మొదటి సెమిస్టర్ పూర్తయి, దానిలో మనోహరన్ తన సామర్థ్యాన్ని చూపేవరకూ అతనికి ఇర్మాలో కొత్త స్నేహితులు కాలేదు. మొట్టమొదట కొన్ని చిన్నచిన్న సమస్యలు ఎదుర్కొన్న అనంతరం IRMAలో అతని జీవితం సాఫీగా సాగడం మొదలు పెట్టింది.

IRMAలో కూడా మనోహరన్ గిరిజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేయాలన్న తన కోరికను కోల్పోలేదు. అతను తన సమయాన్ని ఇంగ్లీష్‌ను మెరుగుపరచుకోవడంలోనూ, అభివృద్ధి, నిర్వహణ వంటి అంశాల్లో తన జ్ఞానాన్ని మెరుగుపరచుకోవడం మీదా కేంద్రీకరించాడు. ఇర్మా తర్వాత జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు (NDDB)లో చేరిన ఆరుగురిలో మనోహరన్ ఒకడు. అతను మార్కెట్ ఇంటర్‌వెన్షన్స్ ఆపరేషన్స్ (MIO) టీమ్‌లో ఒకడిగా ఉండేవాడు. ఈ టీమ్ ప్రధాన కర్తవ్యం NDDB మార్కెటింగ్ చేసే వివిధ వస్తువుల ధరలను నిర్ణయించడం. మనోహరన్, అతని సహచరులు సరాసరి వర్గీస్ కురియన్, NDDB ఉన్నతాధికారుల నేతృత్వంలో పని చేసేవారు. ఇలా అతని కెరీర్ విభిన్నంగా ప్రారంభం కావడం వల్ల అతనికి విధాన కర్తల దృక్పథం ఎలా ఉంటుందో తెలిసి వచ్చింది. NDDBలో అతను తన ఉద్యోగపరంగా చాలా పొద్దు పోయేవరకూ పని చేయడం, నిద్ర లేని రాత్రులు, కొన్నికొన్ని సార్లు 24 గంటల పాటూ డ్యూటీలో ఉండాల్సి వచ్చేది. అతని ప్రియమిత్రుడు రాజన్ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించడంతో NDDBతో మనోహరన్ అనుబంధం ముగిసింది. ఈ సంఘటన మనోహరన్ జీవితంపై ఒక చెరగని ముద్ర వేసి, అతని జీవితంలో ఒక మలుపుగా నిలిచిపోయింది. అదే సమయంలో NDDBలో మనోహరన్, అతని సహచరులు పేదరికం, అభివృద్ధి సమస్యలను దగ్గర నుంచి పరిశీలించాలని నిర్ణయించుకున్నారు. ఈ అవకాశం అతనికి ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ కేంద్రంగా ఉన్న గిరిజన్ సహకార సంఘం (GCC) రూపంలో తలుపు తట్టింది.

GCCలో మొదటి బ్యాచ్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లలో మనోహరన్ ఒకడు. GCCని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1956లో నెలకొల్పింది. దాని లక్ష్యం రాష్ట్రంలోని గిరిజనులకు సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించడం. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు ఎక్కువగా ఉన్న వివిధ జిల్లాలలో పని చేయడానికి GCC వివిధ యూనివర్సిటీల పోస్ట్ గ్రాడ్యుయేట్లను CCలుగా తీసుకోవడం ప్రారంభించింది. GCC కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఈ CCలు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లోనే నివసించాల్సి వచ్చేది. మనోహరన్ విశాఖ జిల్లాలోని పాడేరు ప్రాంతంలోని ఓ మారుమూల గిరిజన గ్రామంలో ఉండేవాడు. అప్పట్లో ఆ ప్రాంతంలో నక్సల్స్ కార్యకలాపాలు చాలా ఎక్కువగా ఉండేవి. మనోహరన్ కూడా తరచుగా



వారిని కలవాల్సి వచ్చేది, అయితే అవన్నీ కూడా ఎలాంటి ప్రమాదమూ లేకుండా ముగిసాయి. గిరిజనుల సమస్యలను, వారి ఆర్థిక విధానాలను, వారి జీవనోపాధులను పరిశీలించడం మనోహరన్ పని. ఒక CCగా మార్కెటింగ్ చేసుకోగలిగే అడవిలోని కలపేతర అటవీ ఉత్పత్తులను గుర్తించడం అతని పని. మరోసారి మనోహరన్ తనకు బొత్తిగా పరిచయం లేని, భాష రాని ప్రదేశంలోకి వచ్చి పడ్డాడు. తాను గ్రామంలో ఉన్న సమయంలో మనోహరన్ తెలుగు మాట్లాడ్డం, చదవడం, రాయడం నేర్చుకున్నాడు.



అతను కూడా స్థానికుల జీవన విధానాన్ని అలవర్చుకున్నాడు. దురదృష్టవశాత్తూ అక్కడి నీళ్లు, తిండి మనోహరన్ ఒంటికి పడలేదు. అతను కామెర్ల వ్యాధి బారిన పడడడంతో కాలేయం బాగా దెబ్బ తింది. ఈ విధంగా అనారోగ్యం పాలు కావడంతో మనోహరన్, తన తల్లిదండ్రుల సలహా మేరకు ఇంటికి వెళ్లిపోయాడు.

1994లో మనోహరన్ తిరుచ్చిలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. తర్వాత ఏం చేయాలనే దానిపై మనోహరన్‌కు అప్పటికి స్పష్టమైన ఆలోచనలేమీ లేవు. అప్పటికి అతని తండ్రి పదవీ విరమణ చేసి ఉన్నారు. తన అల్లుడితో కలిసి ఎరువుల వ్యాపారాన్ని ప్రారంభించాలని ఆయన అప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉన్నారు. వారు మనోహరన్‌ను తమతో పాటూ కలవాలని కోరారు. మనోహరన్ అయిష్టంగానే అందుకు అంగీకరించాడు. ఆరు నెలల పాటూ అతను వారికి ఆ వ్యాపారంలో సహాయం చేసాడు. అయినా తమిళనాడులోని వివిధ స్వచ్ఛంద సంస్థలలో అవకాశాలు ఏమైనా లభిస్తాయా అని అతను వెదుకుతూనే ఉన్నాడు.

ACCORD గురించి ఒక స్నేహితుని ద్వారా విన్న మనోహరన్, గుడలూర్‌లో దాని వ్యవస్థాపకుడు స్టాన్‌ను కలవాలని నిర్ణయించుకున్నాడు. మనోహరన్ మొట్టమొదటిసారిగా స్టాన్‌ను గుడలూర్‌లోని ACCORD కార్యాలయంలో కలుసుకున్నాడు. ACCORD అప్పటికి ఇంకా మొగ్గదశలోనే ఉంది.

నీలగిరి ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధి కోసం 1993లో ACCORDను ఏర్పాటు చేసారు. నేడు ఈ సంస్థ నీలగిరి గిరిజనుల కోసం ఒక పాఠశాలను, ఒక ఆసుపత్రిని నిర్వహిస్తోంది. ఈ సంస్థకు చెందిన ఆదివాసీ మున్నేట్ర సంఘం ఆ ప్రాంతంలోని గిరిజనుల హక్కుల కోసం పోరాడుతోంది. జీవనోపాధుల విషయంలో స్థానికులకు సహకరించే అకార్డ్, వారు సొంతంగా వివిధ సంస్థలను ఏర్పాటు చేసుకుని రుణాలు పొందడంలోనూ, జీవనోపాధుల విషయంలోనూ వారికి సహాయపడుతుంది.

1995లో, స్టాన్‌ను కలిసిన మూణ్నెల్ల అనంతరం మనోహరన్ ACCORDలో చేరాడు. అతను చేరినప్పటికి ACCORD పాఠశాల, ఆసుపత్రి ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. సంస్థలో కేవలం కొద్ది మంది వృత్తి నిపుణులు మాత్రమే ఉండగా, మిగతా ఉద్యోగులలో ఎక్కువ మంది ఏదో కొంచెం చదివిన స్థానిక గిరిజనులు ఉండేవారు. మెల్లమెల్లగా ACCORDలో పనులు జరిగే విధానాలను దారిలో పెడుతూ మనోహరన్ తన స్థానాన్ని పదిలపర్చుకున్నాడు. అతను ACCORD సపోర్ట్ టీమ్‌లో ఒక సభ్యుడిగా ఉండేవాడు. ACCORDలో చేరాక అతను నిర్వహణ, పరిపాలన బాధ్యతలు చూసుకునేవాడు. అయితే అతను కేవలం తన సమయాన్ని గుడలూర్‌లోని ఆఫీసులోనే గడపడంతో సరిచపుచ్చుకోలేదు. తరచుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, అక్కడ గిరిజనుల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి, ACCORD సహకారంతో నిర్వహించే వారి సంస్థలను పరిశీలించేవాడు.



మనోహరన్ ఇతర కార్యకలాపాలలో – దాతల కోసం ప్రాజెక్ట్ ప్రతిపాదనలు, ACCORD కార్యకలాపాలను పర్యవేక్షించడం, గుడలూర్ కార్యాలయాన్ని పర్యవేక్షించడం తదితరం ఉండేవి.

ఇవన్నీ అతను గొప్ప సమర్థతతో నిర్వహించేవాడు. దాతలు ఏం కోరుకుంటారో ఊహించడంలో అతను గొప్ప పరిణితి కనబరిచేవాడు. వాటిని ప్రతిపాదనలుగా మార్చడంలో ACCORDలో అతను గొప్ప పేరు సంపాదించాడు. ACCORDలోని అతని సహచరులు అతను ఎంతో ఓపికగా గంటల కొద్దీ దాతల సందేహాలకు ఎలా సమాధానాలు ఇచ్చేవాడో గుర్తు చేసుకుంటారు.



మనోహరన్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల వల్ల ఆ సంస్థకు వివిధ కార్యకలాపాల కోసం ఎంతో అవసరమైన నిధులు రావడం ప్రారంభించాయి. దీంతో ఆ సంస్థ బీమా కార్యక్రమాలు, ఒక కొత్త ఆసుపత్రి, పాఠశాల నిర్మించుకుంది. కానీ మనోహరన్ అక్కడితో ఆగిపోలేదు. ACCORDను ఇంకా ఉన్నత స్థితికి చేర్చాలని అతను నిర్ణయించుకున్నాడు.

ఆ తర్వాత అతను ACCORD సిబ్బందిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే బాధ్యతలపై దృష్టి కేంద్రీకరించాడు. సంస్థలో యాజమాన్య నిర్వహణ కార్యకలాపాలను సమర్థంగా అమలు చేయడం ప్రారంభించాడు. సంస్థలో మనోహరన్‌ను అందరూ ఒక అనుసరించాల్సిన నమూనాగా పేర్కొనేవారు. నెలవారీ ప్రణాళికలు, సమీక్షల అవసరాన్ని అతను నొక్కి చెప్పేవాడు. ఈ సమావేశాలపై పట్టుబట్టి, వాటిని సంస్థలో ఒక అలవాటుగా మార్చివేసాడు. తన రోజువారీ కార్యక్రమాలను ముందుగానే నిర్ణయించుకునే మనోహరన్, తన సిబ్బంది కూడా అదే విధానాన్ని అనుసరించే విధంగా ప్రోత్సహించేవాడు. ఆసుపత్రి, పాఠశాల సిబ్బంది కూడా ACCORD సమావేశాలలో పాల్గొనే విధంగా మనోహరన్ జాగ్రత్త వహించేవాడు. ఈ చర్య వల్ల ACCORDలోని ముగ్గురికీ బలమైన సంబంధాలు ఏర్పడ్డాయి.




అతను చేసిన మరో ముఖ్యమైన పని – పరిపాలన వ్యవస్థను మొత్తం కంప్యూటరీకరించడం. జీతాలు లెక్కించడానికి, ఆదాయం ఎంత, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు, మొదలైన వాటి కోసం మనోహరన్ ఎప్పటికప్పుడు ప్రోగ్రామ్‌లు తయారు చేసేవాడు. దీని కోసం అతను గంటల కొద్దీ కోడింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు తయారు చేయడంపై గడిపేవాడు. ACCORDలో అతను తయారు చేసిన కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను ఇప్పటికీ ఉపయోగించు కుంటున్నారు.

స్థానికులు తామే స్వయంగా వివిధ సంస్థలను ఏర్పరచుకుని, వారే స్వయంగా వాటిని నిర్వహించుకునే విధంగా ACCORD సహకరిస్తుంది. అయితే ఇది కార్యరూపం ధరించాలంటే సిబ్బందిలో యాజమాన్య నైపుణ్యాలు పెరగాల్సి ఉందని మనోహరన్ గుర్తించాడు. అందువల్ల అతను సిబ్బంది కోసం యాజమాన్య శిక్షణా తరగతులు నిర్వహించడం ప్రారంభించాడు. మూడు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణలో ప్లానింగ్, వనరుల నిర్వహణ మొదలైన వాటిపై వివిధ అంశాలను బోధించేవారు.

సిబ్బంది తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను వారు తమ పనిలో ఉపయోగించే విధంగా మనోహరన్ వారిని ప్రోత్సహించేవాడు. ఈ విధంగా మనోహరన్ ఆఫీసు కార్యకలాపాలను తామంతట తాము నిర్వహించు కోగల కొంత మంది సిబ్బందిని తయారు చేసాడు. కంప్యూటర్లను ఉపయోగించుకోవడం, రిపోర్టులు రాయడం, బడ్జెట్ తయారు చేయడం తదితర వాటిలో సిబ్బంది నైపుణ్యం సాధించడానికి అతను గంటల కొద్దీ వారితో గడిపేవాడు. తాను ఇచ్చిన శిక్షణను ఆయా సిబ్బంది ఇతరులకు



కూడా నేర్పించాలని మనోహరన్ వారితో చెప్పేవాడు. పాఠశాల, ఆసుపత్రి కార్యకలాపాలలో కూడా మనోహరన్ ఒక క్రమపద్ధతిని తీసుకువచ్చాడు.

ఈ విధంగా మనోహరన్ ACCORD, దాని కార్యకలాపాలలో ఒక విడదీయరాని భాగంగా మారిపోయాడు. అతను ACCORD, ఆసుపత్రి, పాఠశాల, దేవెల టీ ఎస్టేట్, జస్ట్ ఛేంజ్ (ఒక ఉత్పత్తిదారుల కంపెనీ), తులిర్ ట్రస్ట్‌లలో ముఖ్యమైన భాగమైపోయాడు. 2012 నాటికి మనోహరన్ 32 వెబ్‌సైట్లను స్వయంగా డిజైన్ చేసాడు. కొంత డొమైన్ స్పేస్‌ను కూడా కలిగి ఉండి, ఇతర వెబ్‌సైట్లను కూడా హోస్ట్ చేసేవాడు.

మనోహరన్ గుడలూర్‌కు వచ్చినపుడు, అతనెన్నడూ తాను అక్కడే స్థిరపడాలనుకున్న విషయాన్ని చెప్పలేదు. 1996లో అతను స్థానిక పాఠశాలలో పని చేసే దుర్గను వివాహం చేసుకున్నాడు. వారు 1997లో తమ కూతురు వెన్నిలను దత్తత తీసుకున్నారు. ఆ తర్వాత అతనెన్నడూ వెనుదిరిగి చూడలేదు. గుడలూర్ అతని జీవితంలో ఒక భాగమైపోయింది. స్థానిక విషయాలలో ఎంతో లోతుగా కూరుకుపోయిన అతను, గిరిజనుల జీవితాలను మెరుగుపర్చడానికి ఎంతో కృషి చేసాడు.

అతని స్నేహితులు, సహచరులు, సిబ్బంది మనోహరన్ వినయాన్ని, అతని ప్రజాస్వామ్య పని విధానాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. అతనిలోని అంతులేని ఓర్పును, తోటివాళ్ల సామర్థ్యాలను, నైపుణ్యాలను అభివృద్ధి చేసే విషయంలో అతనికున్న అచంచల విశ్వాసాన్ని గుర్తు చేసుకుంటారు. అతనెప్పుడూ పని చేస్తూనే, పని గురించి ఆలోచిస్తూనో ఉండేవాడని వెల్లడించారు. మనోహరన్ తన కంప్యూటర్‌కు దూరంగా ఉండడం ఎప్పుడోగానీ వారు చూసెరగరు. చివరికి అతనికి క్యాన్సర్ ఉందని తెలిసాక కూడా.

మనోహరన్ మానవ సంబంధాలకు కూడా అత్యంత విలువనిచ్చేవారు. అతను తన స్నేహితులు ప్రతి ఒక్కరితోనూ సంబంధాలు పెట్టుకునేవాడు. మొదట 'మ్యూజింగ్స్' పేరిట ఒక న్యూస్ లెటర్, ఆ తర్వాత అదే పేరుతో అతను ఒక బ్లాగ్‌ను ప్రారంభించాడు. ఈ బ్లాగ్‌లో మనోహరన్ పని గురించి తక్కువగా మాట్లాడేవాడు. దానిలో అతను తనకు ఆసక్తి కలిగించిన అనేక విషయాలను, వ్యాసాలను, తన ఆలోచనలను స్నేహితులతో పంచుకునేవాడు. తన కూతురు వెన్నిలకి అతనో ముద్దుల తండ్రి. పెంపుడు తండ్రి అయినా వారిద్దరి మధ్య ప్రత్యేకమైన బంధం పెంపొందింది.

ACCORDలో తన పని విధానంతో మనోహరన్ ఎంతో మంది సిబ్బందిపై తన ప్రభావాన్ని కనబరిచాడు. అతని ప్రజాస్వామ్య విలువలు, ఇతరులతో కలిసిపోయే అతని తత్వాన్ని వారిప్పటికీ గుర్తు చేసుకుంటారు. తనకు క్యాన్సర్ ఉందని తెలిసినప్పుడు కూడా అతని మొహంలో ఏ మాత్రం భయం కనిపించలేదు. ఆ విషయాన్ని ఎంతో ప్రశాంతంగా విన్న మనోహరన్, తన భావాలను ఎన్నడూ బయటపెట్టలేదు. తన బాధ్యతలను ఎన్నడూ విస్మరించని మనోహరన్ ముఖంలో ఎలాంటి పశ్చాత్తాపమూ లేదు. ఈ చిన్న జీవితంలో తాను చేయగలిగిందంతా చేశాననే తృప్తి అతని ముఖంలో కనిపించేది.



మనోహరన్ గొప్పదనం ఒక ఉన్నత ఉద్యోగంలో చేరి ఇతరుల్లా ఆడంబరంగా జీవించకుండా, నీలగిరి కొండల్లో గిరిజనులు ఎక్కువగా ఉన్న ఒక చిన్న పట్టణంలో నివసించడంలో లేదు. అతని గొప్పదనం అతని వినయంలో, ప్రజల మీద అతని నమ్మకంలో, ఇతరుల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే అతని పట్టుదలలో ఉంది. అతను ఈ లక్షణాలతోనే జీవించాడు, వాటినే శ్వాసించాడు. అతను చేసిన పనులకన్నా, ఈ లక్షణాల వల్లే ఇతరులపై అతని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ✸

# ఈ సంవత్సరంలో ముఖ్యమైన సంఘటనలు











STATE STATUS

CEC V S Sampath

**Delhi** 70 seats
Voters 1.15 crore
Polling on December 4
2008 | Cong 43, BJP 23
After 3 terms of Sheila Dikshit, may be heading for hung House. AAP may prove spoiler

**Rajasthan** 200 seats
Electorate 4.1 crore
Polling on December 1
2008 results | Cong 96, BJP 78, BSP 6, Others 20
BJP has the edge but incumbent Cong can't be ruled out

**Madhya Pradesh** 230
Electorate 4.6 crore
Polling on November 25
2008 | BJP 143, Cong 71
Shivraj Singh Chouhan probably best placed among incumbent CMs in fray. BJP favoured to complete a hat-trick of victories

**Chhattisgarh** 90
Electorate 1.7 crore
Polling on November 11, 19
2008 | BJP 50, Cong 38, BSP 2
Efficient public distribution system and infighting within Congress may help BJP's Raman Singh retain power

**Mizoram** 40
Electorate 6.9 lakh
Polling on December 4
2008 | Cong 32, MNF 3
Cong has the advantage, but Mizo National Front could make comeback after its disastrous showing last time



# ఎ.వీరనారాయణం గ్రామం

**ఎ.**వీరనారాయణం గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా, మాడుగుల మండలంలోఉంది. ఇది జిల్లా కేంద్రమైన విశాఖపట్నంకు పశ్చిమాన, 58 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి స్థానికుల భాష తెలుగు.

ఈ గ్రామంలో సుమారు 110 ఇళ్లున్నాయి. ప్రతి కుటుంబంలో సగటున ఐదుగురు సభ్యులుంటారు. అయితే గత కొన్నేళ్లుగా ఇక్కడి కుటుంబాల్లోని సగటు సభ్యుల సంఖ్య తగ్గిపోతోంది. ఇక గ్రామంలోని కులాల విషయానికి వస్తే, గ్రామంలో ఎక్కువగా ఎస్టీ కులాలవారున్నారు. మిగతా వారంతా బీసీలు, ఓసీలు. ఈ గ్రామంలో ఎస్సీ జనాభా ఎవరూ లేరు.

**ఆరోగ్యం:** గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి కొంచెం ఆందోళనకరంగా ఉంటుంది. అనేక మంది ప్రజలు అనారోగ్య పరిస్థితుల మధ్య జీవిస్తున్నారు. బహిరంగ మల విసర్జన ఇక్కడ సర్వసాధారణం. దీని వల్ల వీరు జబ్బుల బారిన పడే ప్రమాదం ఇంకా ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన 104 సర్వీస్ నెలలో ఏదో ఒక శుక్రవారం ఇక్కడికి వచ్చి వీరికి సేవలు అందిస్తున్నా, దీని సేవలు ఎప్పుడో కానీ వారికి ఉపయోగపపడడం లేదు.

గ్రామంలో మంచి నీటి వ్యవస్థ పకడ్బందీగా ఉండడంతో నీటి సరఫరా బాగుంది. గ్రామంలో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఒక ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉంది. ఇది గ్రామం నీటి అవసరాలు తీరుస్తోంది. దీనికి తోడు గ్రామస్తుల ఇతర నీటి అవసరాలు తీర్చడం కోసం గ్రామంలో 4 బోరు బావులు కూడా ఉన్నాయి.

**విద్య:** ప్రస్తుతం ఈ గ్రామంలో ఓ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఇందులో చుట్టుపక్కల ఐదారు గ్రామాల విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకూ మొత్తం 81 మంది విద్యార్థులున్నారు. గతంలో పాఠశాలలో 120 మంది విద్యార్థులుండేవారు. గత ఏడాది ఈ పాఠశాలలో ముగ్గురు పర్మనెంట్ ఉపాధ్యాయులు, నలుగురు విద్యా వాలంటీర్లు ఉండగా, ఈ ఏడాది కేవలం ఇద్దరు పర్మనెంట్ టీచర్లు మాత్రం మిగిలారు. ఇదే కాకుండా ఇక్కడ ఓ అంగన్‌వాడీ సెంటర్ కూడా ఉంది. ఇది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నడుస్తుంది. సుమారు 20 మంది పిల్లలు ఇక్కడ చదువుకుంటారు. వీరికిక్కడ ప్రాథమిక గణితం, అక్షరమాల, కొన్ని పాటలు, పద్యాలు నేర్పిస్తారు.

**జీవనోపాధులు:** ఈ గ్రామస్తుల ముఖ్య జీవనోపాధి వ్యవసాయం. వ్యవసాయంలో ఎక్కువ భాగం వర్షాధారం. ఇక్కడ పండే ముఖ్య పంటలు వరి మరియు చెరుకు. కొద్ది భాగంలో కంది పంటను పండిస్తారు. గ్రామం పక్కనే ఓ చిన్న నది ప్రవహిస్తూ ఉన్నా, గ్రామస్తుల పంట పొలాలకు, నదికీ మధ్య ఓ చిన్న గుట్ట ఉండడంతో గ్రామస్తులు ఆ నది నీటిని వినియోగించుకోలేకపోతున్నారు. అందువల్ల వారు వర్షాకాలం పంటల మీద ఆధారపపడమే ఎక్కువ. వీరు పండించే పంటలలో ఎక్కువగా వారి వినియోగం కోసమే పండిస్తారు. మార్కెట్లలో అమ్ముకోవడానికి పండించే పంటలు చాలా తక్కువ. గత మూడేళ్లుగా వర్షాలు సరిగా కురవక పోవడంతో పంట దిగుబడి తక్కువగా ఉంది.

గ్రామంలో రెండో ప్రధాన జీవనోపాధి కూలీ పని. వర్షాలు తక్కువగా పడిన సందర్భంలో కూడా కింది వైపు ఉన్న గ్రామాల్లో సమృద్ధిగా నీరు లభిస్తుండడంతో, ఈ గ్రామస్తులు పని కోసం పక్క గ్రామాలకు వెళుతున్నారు. వీరి గ్రామంలో నదికి పై భాగంలో ఒక చిన్న చెక్ డ్యాము నిర్మించారు. అయితే ఈ డ్యామ్ దెబ్బ తినడంతో, నీరు ఆ చెక్ డ్యాము గుండా వృధా అవుతూ ఉంటుంది. దీని వల్ల వారికి పంట పండనప్పుడు నీటి సదుపాయం కల్పించాల్సిన చెక్ డ్యామ్, వారి పంటలు కొట్టుకుపోవడానికి కారణమవుతోంది. గ్రామంలోని కుటుంబాలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం (MGNREGA) వల్ల కూడా చెప్పుకోదగిన ఆదాయమే లభిస్తోంది. గ్రామంలోని సుమారు 95 శాతం కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి.

**వలసలు:** గ్రామంలోని కుటుంబాలకు వ్యవసాయం వల్ల పెద్దగా ఆదాయం లేకపోవడంతో, గ్రామంలోని అనేక మంది పనులు వెదుక్కుంటూ దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. వీరు చెన్నై, హైదరాబాద్, నంద్యాల లాంటి ప్రదేశాలకు వలస వెళుతున్నారు. ప్రతి కుటుంబంలోనూ కనీసం ఒక్కరైనా ఇలా వలస వెళ్లిన వారున్నారు. వీరిలో అనేక మంది సామాజిక భద్రత లేని అసంఘటిత రంగాలైన నిర్మాణ పరిశ్రమలాంటి వాటి వాటిలో ఉన్నారు. ఆ పనుల్లో నిబంధనలు వీరికి అనుకూలంగా లేకపోవడంతో వీరి శ్రమశక్తిని కొల్లగొడుతున్నారు. అతి తక్కువ వేతనాలిస్తు వ్యవసాయ పనులు తక్కువగా ఉన్న కాలాల్లో గ్రామం నుంచి ఈ వలసలు ఎక్కువగా ఉంటాయి. అంటే జనవరి, మే మొదటి వారం మధ్యలో వలసలు ఉంటాయి. సాధారణంగా మొత్తం కుటుంబం వెళితే తప్ప ఇక్కడి నుంచి మహిళలు వలస వెళ్లరు.

**మహిళల పాత్ర:** సంప్రదాయ కుటుంబాలు అన్నిటిలో మాదిరిగానే ఇక్కడ కూడా మహిళలది ద్వితీయ స్థానమే. నిర్ణయాలు తీసుకోవడంలో మహిళల అభిప్రాయాలకు పెద్దగా విలువివ్వరు. మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నప్పటికీ, ఈ గ్రూపులకు ప్రోత్సాహం లేకపోవడంతో ఈ గ్రూపులు పెద్దగా పని చేయడం లేదు. ఉన్నతస్థాయి కులాల మహిళలు నిధులన్నీ ఉపయోగించుకోవడం/దుర్వినియోగం, డ్వాక్రా గ్రూపుల లక్ష్యం నెరవేరలేదు. ప్రస్తుతం ఈ గ్రామంలో ఏ స్వయం సహాయక బృందమూ పని చేయడం లేదు.

ఇక్కడి గ్రామ ప్రజల జీవనోపాధులను ఎన్నో వైవిధ్యకరమైన విధానాలలో తీర్చిదిద్దే అవకాశముంది. ఒక సహకార సంఘంగా ఏర్పడిన గ్రామస్తులు, తమ సమిష్టి కృషి ద్వారా పశుపోషణలోని ఉత్తమ పద్ధతులను అనుసరించవచ్చు, కోళ్ల పెంపకాన్ని చేపట్టవచ్చు, పంట ఉత్పత్తులపై పొట్టు తీయడం వంటి పంట నూర్పిడి అనంతర కార్యకలాపాలను చేపట్టవచ్చు. ✸

వ్యక్తిగత

## జామ పండ్లు అమ్మడం



సమిష్టి

## బుట్టల తయారీ



సామాజిక

## దృష్టి సంస్థ ద్వారా జర్దోసి శిక్షణ




ప్రజల

## వ్యవసాయ మార్కెట్



కమ్యూనిటీ ఆర్గనైజేషన్

## అలంపూర్ మండల మహిళా సమాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్‌లో అలంపూర్ మండల మహిళా సమాఖ్య (MMS) ను 2003లో స్థాపించారు. దీనిలో 735 స్వయం సహాయక బృందాలకు చెందిన 32 గ్రామైక్య సంఘాల (వీఓ) ప్రతినిధులు ఉన్నారు. మండల సమాఖ్యలో ఐదుగురు కార్యనిర్వాహక సభ్యులుంటారు. వీరు – అధ్యక్షురాలు – దేవమ్మ; ఉపాధ్యక్షురాలు – ఈశ్వరమ్మ; కార్యదర్శి – కుమారి; సంయుక్త కార్యదర్శి – జానకమ్మ; కోశాధికారి – వెంకాయమ్మ.

ఈ MMSలో 3 ఉప కమిటీలున్నాయి. అవి – పర్యవేక్షక కమిటీ, బ్యాంక్ లింకేజి కమిటీ, స్థానిక పెట్టుబడి నిధి (CIF) మరియు క్రిమిసంహారక రహిత నిర్వహణ (NPM) కమిటీ. ప్రతి కమిటీలో ఇద్దరు ఈసీ సభ్యులు, ఒక ఆఫీస్ బేరర్ ఉంటారు. ఇప్పటివరకూ MMS 63 లక్షల స్థానిక పెట్టుబడి నిధి అందుకుంది. బలహీన వర్గాల వారికి సాధికారత చేకూర్చేందుకు వివిధ పథకాల కింద ఇచ్చే పలు నిధులను కూడా ఈ సమాఖ్య పొందింది. అభయ హస్తం పథకం కింద MMSకు చెందిన 1007 మంది సభ్యులు నమోదు చేసుకున్నారు. స్వయం సహాయక బృందం సభ్యుల వృద్ధాప్యంలో వారికి, వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత అందివ్వడానికి ఉద్దేశించినది అభయ హస్తం పథకం. ఈ పథకం వారి వాటా సహాయంతో నిర్వహించే ఒక పింఛన్ మరియు బీమా పథకం. ప్రస్తుతం MMSకు చెందిన 178 మంది సభ్యులు ఈ పథకం కింద ప్రతినెల రూ.500 పింఛన్ అందుకుంటున్నారు. ఈ స్వయం సహాయక బృందం సభ్యుల పిల్లలు 719 మందికి MMS అభయ హస్తం పథకం కింద స్కాలర్‌షిప్పులు కూడా అందిస్తోంది. మరో 145 మంది బాలికలకు 'బంగారు తల్లి' పథకం కింద నమోదు చేసుకున్నారు. ఈ పథకంలో ప్రతి కుటుంబంలోని బాలికకు ఆమె పుట్టినప్పటి నుంచి డిగ్రీ పూర్తి చేసేవరకూ విద్యాపరమైన ఖర్చులన్నీ భరిస్తారు. బాలికల సామాజిక స్థితిగతులను మెరుగుపరచడమే ఈ పథకం యొక్క లక్ష్యం.

MMS క్రమం తప్పకుండా గ్రామ సంస్థ సభ్యులకు, కార్యనిర్వాహక వర్గ సభ్యులకు శిక్షణ అందిస్తుంది. ఐదు గ్రామాలకు కలిపి ఒక కమ్యూనిటీ కార్యకర్త(CA)ను నియమిస్తారు. వీరు సభ్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి క్రిమిసంహారక రహిత నిర్వహణపై శిక్షణ అందిస్తారు. అలంపూర్ మండలంలో ప్రస్తుతం ముగ్గురు CAలున్నారు. వీరు మొత్తం 15 గ్రామాలకు తమ సేవలందిస్తున్నారు. మండలంలోని స్వయం సహాయక బృందాల సభ్యులు తమ జీవనోపాధులు, పిల్లల చదువులు, ఆహార భద్రత, ఆరోగ్యం తదితర సమస్యలను MMS సహాయంతో పరిష్కరించుకోగలిగే స్థాయిలో ఉన్నారు. *

సహాయక సంస్థ

## జైహింద్ స్వచ్ఛంద సంస్థ

జైహింద్ స్వచ్ఛంద సంస్థను కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట మండలం, వాత్సవాయి గ్రామంలో నెలకొల్పారు. ఇది గత 25 ఏళ్లుగా తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థ నిరక్షరాస్యత నిర్మూలన, పేద ప్రజల జీవన విధానాలను మార్చడం తదితర కార్యక్రమాలను దాదాపు 40 గ్రామాల్లోని మహిళలతో కలిసి చేపడుతోంది.

స్వయం సహాయక బృందాలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ సంస్థ సహకరిస్తుంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 3 మండలాలలో సుమారు 2000 మంది కలిసి ఎస్ఎహెచ్‌జీలుగా ఏర్పడ్డారు. ప్రస్తుతం వాత్సవాయి గ్రామంలో 192 కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్యక్రమాలు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా మారాయి. ఈ సంస్థ ఎస్సీ కార్పొరేషన్, DRDA మరియు బ్యాంకుల సహకారంతో మహిళలకు పశుసంపదను అందిస్తోంది. నెహ్రూ యువ కేంద్రంతో కలిసి ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. జైహింద్ స్వచ్ఛంద సంస్థ సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పురస్కారాన్ని కూడా అందుకుంది.

పర్యావరణపై అవగాహన పెంచే కార్యక్రమంలో భాగంగా ఈ సంస్థ వివిధ గ్రామాలలో చైతన్య కార్యక్రమం పేరిట స్కూలు పిల్లలతో కలిసి చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. స్వయం సహాయక బృందాల ఆర్థిక సహాయం కోసం ఈ సంస్థ వాటికి బ్యాంకులతో సంబంధాలు ఏర్పరిచి, రుణాలు పొందేలా సహకరిస్తుంది. ఇప్పటివరకూ ఇలా ఆ సంస్థ 2 కోట్ల రూపాయల రుణాలు పొందేందుకు సహాయపడింది. కంప్యూటర్ కోచింగ్, సంచులు తయారు చేయడం, ప్రింటింగ్, మార్కెటింగ్ తదితర వాటిల్లో వారికి శిక్షణనిస్తోంది.

జైహింద్ మరో స్వచ్ఛంద సంస్థ అప్నా(APNA)తో కలిసి MGNREGAపై జగ్గయ్య పేటలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనితో పాటూ వీరు SHGలను గ్రామస్థాయిలో 20 మంది సభ్యులతో బృందాలుగా విభజించి, వారికి పేద ప్రజల జీవనోపాధులపై శిక్షణను ఇస్తున్నారు. *

శిక్షణా సంస్థలు

1. **ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (EDII)** – www.ediindia.org/
2. **నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ (Ni-MSME)** – http://www.nimsme.org
3. **నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (NIRD)** http://www.nird.org.in
4. **ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (IITD)** – http://www.iitdpune.com/
5. **ఇనిస్టిట్యూట్ ఫర్ క్వాలిటీ స్కిల్ ట్రైనింగ్ (IQST)** http://www.iqstindia.com

# భూసేకరణ, పునరావాస, పున:నిర్మాణ బిల్లు, 2011

ప్రభుత్వం పరిశ్రమలు, బిల్డింగ్‌లు, మౌలిక సదుపాయాల నిర్మాణాలను నిర్మించడానికి భూములు తీసుకున్నందుకు, ఆ భూయజమానులకు తగిన పరిహారం ఇచ్చేందుకు, భూసేకరణలో పారదర్శకతను పాటించేందుకు, భూసేకరణ బాధితులు అయిన వారికి పునరవాస భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ భూసేకరణ, పునరావాస, పున:నిర్మాణ బిల్లు, 2011 చట్టాన్ని చేసింది. ఈ చట్టం ద్వారా దేశ పారిశ్రామికీకరణలో భాగంగా – ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో నెలకొల్పుతున్న అనేక ప్రాజెక్టుల కోసం భూసేకరణ నిబంధలనలను రూపొందించి, వాటిని అమలు పరచడం జరుగుతుంది. 1894, భూసేకరణ చట్టం స్థానంలో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు.

**లక్ష్యాలు:**

* ఈ చట్టం, భూసేకరణ వల్ల ప్రభావితులైన ప్రజలకు పరిహారం విషయంలోనే కాకుండా, పునరావాసం విషయంలో కూడా మార్గదర్శకాలు రూపొందించింది. భారత ప్రభుత్వం లేదా ఏ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసినా (జమ్మూకాశ్మీర్ మినహా) ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. దీనిని 2014, జనవరి 1 నుంచి అమలు చేస్తారు.

* భూమి కోల్పోయిన నిర్వాసితులకు ఈ చట్టం కింద తగిన, న్యాయబద్ధమైన పరిహారాన్ని అందజేస్తారు.

* ప్రభుత్వం సేకరించే ఈ భూమిని ప్రజావసరాల నిమిత్తం ప్రైవేట్ సంస్థలకు అందజేయడం ఈ చట్టం లక్ష్యం. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (PPP) ప్రాజెక్టులు కూడా దీని పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములు ఈ చట్టం పరిధిలోకి రావు.

* ప్రజావసరాల నిమిత్తం ప్రైవేట్ సంస్థల కోసం వ్యక్తుల భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవడానికి ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది. ప్రత్యేక ఆర్థిక మండలి, అణు విద్యుత్, రైల్వేలు తదితర రంగాల కోసం ఉన్న ప్రస్తుత 16 చట్టాలను ఈ చట్టం పరిధి నుంచి మినహాయించారు.

**భూసేకరణ దాని ప్రభావం?** దీని వల్ల అనేక మంది ప్రజలు తమ జీవనోపాధి కోల్పోతారు. ఇలా తరలించబడిన వారిని ప్రాజెక్టు ప్రభావిత ప్రజలుగా పేర్కొంటారు.

**పునరావాసం మరియు పునర్నిర్మాణం:**

* గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్ విలువను రెండు రెట్లు, ఆ భూమిపై లేదా బిల్డింగ్‌పై ఉన్న ఆస్తుల విలువను దానికి కలిపి, దానిపై నష్టపరిహారాన్ని అందజేస్తారు. అదే విధంగా పట్టణ ప్రాంతాలలో కూడా మార్కెట్ విలువ, స్థలంతో పాటు ఉన్న ఆస్తుల విలువను లెక్కకట్టి, వాటికి అదనంగా నష్టపరిహారాన్ని ఇస్తారు.

* ప్రైవేట్ ప్రాజెక్టుల కోసం భూమిని సేకరిస్తున్నట్లైతే డెవలపర్స్ ఆ భూసేకరణ చేస్తున్న ప్రజల్లో 80 శాతం మంది ప్రజల అంగీకారాన్ని పొందాల్సి ఉంటుంది. అదే PPP ప్రాజెక్టుల కోసమైతే 70 శాతం మంది యజమానుల అంగీకారం తప్పనిసరి.

* 2-3 పంటలు పండే, నీటి పారుదల కలిగిన భూమిని రక్షణ, ప్రకృతి విపత్తుల వల్ల కలిగే అత్యవర పరిస్థితి కోసం తప్ప సేకరించరాదు. భూమిని ఏ అవసరాల కోసమైతే తీసుకున్నారో, ఐదేళ్లలోపు దానిని ఆ అవసరాల కోసం ఉపయోగించుకోకుంటే, దానిని తిరిగి దాని యజమానికి ఇవ్వాల్సి ఉంటుంది. అది ప్రజా ప్రయోజనార్థం కావచ్చు, పీపీపీ ప్రాజెక్టుల కోసమైనా కావచ్చు. ఒకవేళ కంపెనీలే ప్రత్యక్షంగా భూమి యజమానుల నుంచి 40 హెక్టార్ల భూమిని సేకరించినట్లైతే, ఆ భూమిపై ఉన్నవారి పునరావాసానికి వారే పూచీ ఉండాల్సి వస్తుంది.

* ప్రాజెక్టు కారణంగా ప్రభావితులైన ప్రజలకు ఎక్కడైతే పునరావాసం కల్పిస్తున్నారో అక్కడ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను కూడా ఈ బిల్లులో పొందుపరిచారు.

* ఈ బిల్లులో పొందుపరిచిన మరో మౌలికాంశం ఏమిటంటే, ప్రభుత్వం కేవలం తాను సేకరించిన, లేదా స్వాధీనం చేసుకున్న ఆస్తులకు మాత్రమే కాదు, కోల్పోయిన జీవనోపాధులకు, ఇళ్లకు కూడా పరిహారం చెల్లించాలి. బంజరు భూములు, ఉమ్మడి భూములు, అడవులు, చెరువులు, కుంటలపై ఆధారపడి జీవించే కుటుంబాలుంటాయి. అడవులపై ఆధారపడి జీవించేవారికి, మత్స్యకారులు తదితరులకు కూడా పరిష్కారం చెల్లించాలని ఈ బిల్లులో పొందుపరిచారు.

ఈ పునరావాస మహిళల విషయాన్ని కూడా ప్రస్తావించారు. వారి హక్కులకు కూడా భరోసా కల్పించారు. భూమి, ఇతర ఆస్తులను మహిళలు, పురుషులు ఇద్దరి పేర్లపై నమోదు చేయాలి. ఏక మొత్తంగా ఇచ్చే సొమ్మైనా, ఏ రూపంలోని నగదునైనా ఉమ్మడి అకౌంట్లలో జమ చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధిత మహిళలందరి పేర్లనూ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

PPP ప్రాజెక్టుల కోసం లేదా ప్రైవేట్ సంస్థల కోసం భూసేకరణ చేపడుతున్నట్లైతే, ఎవరి భూములైతే సేకరిస్తున్నారో వారిలో కనీసం 70% నుంచి 80 % మంది అంగీకారం తీసుకోవాల్సి ఉంటుంది. దీని వల్ల బలవంతపు భూసేకరణ సాధ్యం కాదు.

ఎక్కడ అవార్డులైతే ఇచ్చారు కానీ పరిహారం చెల్లించలేదో, అక్కడ కొత్త చట్టం నిర్దేశించిన ప్రకారం పరిహారం చెల్లించాకే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలి. ఎక్కడైతే అవార్డు ఇంకా ఇవ్వలేదో, అప్పటివరకూ నడిచిన వ్యవహారం మొత్తం కాలపరిమితి తీరిందని భావించాల్సి వస్తుంది. కొత్త చట్టం అమలు కావడానికి ఐదేళ్ల ముందు భూసేకరణ జరిగి, పరిహారం మాత్రం చెల్లించనట్లైతే, అక్కడ కూడా ఆయా కార్యకలాపాలన్నీ కాలపరిమితి తీరిపోయినట్లు భావిస్తారు.

ఈ చట్టం లక్ష్యం ప్రజలను ఒక చోటి నుంచి తరలించడాన్ని నిరుత్సాహపరచి, లీజు, ప్రైవేట్ కొనుగోళ్లు చేయడానికి ప్రోత్సహించడం. రెండో విషయానికి వస్తే, ఆయా భూమి రేట్లు రెండు పార్టీలు బేరం చేసుకున్న దాని మీద ఆధారపడి ఉంటాయి. నిజానికి 20 ఏళ్ల కాలంలో కేవలం కొనుగోళ్లు మాత్రమే ఉండాలనీ, మరీ అత్యవరమైన సందర్భాలలో తప్ప ప్రభుత్వం భూమిని సేకరించే పనిని పెట్టుకోగూడదన్నది ఈ చట్టం ఉద్దేశం. ఈ బిల్లు వల్ల అనేక విదేశీ కంపెనీలు మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావన్న వాదన ఉంది. అయితే ఇది కేవలం ఒక అభిప్రాయమే తప్ప వాస్తవం కాదు. ఈ భయాలన్నీ నిజానికి భూతద్దంలో చూపిస్తున్నారు. భూసేకరణే అవసరమైతే, అది ఆ భూమి నుంచి దూరం చేస్తున్న రైతులు, దళితులు, గిరిజనులకు మేలు చేసేదిగా, వారి జీవనోపాధులకు పరిహారంగా ఉండాలి కానీ వారిని పణంగా పెట్టి కాదు.

ఈ బలహీన వర్గాల వారి శ్రేయస్సును కాంక్షించే ఏ బిల్లైనా జాతీయ శ్రేయస్సును కాంక్షించేదే కాగలదు. వీరి నుంచి భూములను బలవంతంగా సేకరించే ఏ బిల్లుకు ద్వారాలు మూసివేయడమైనా అది కూడా జాతీయ శ్రేయస్సే. పరిశ్రమలు చాలా ముఖ్యమే. కానీ ఈ బిల్లును మొత్తం సమాజంలోని అన్ని వర్గాల దృక్పథం నుంచి చూడాలి కానీ కేవలం ఏ ఒక్కరి దృక్పథం నుంచి కాదు. ✸

# పూల బొకేలు



పూలను అందంగా, సృజనాత్మకంగా అమర్చితే దానినే పూల బొకే అంటారు. ఇళ్లు, బిల్డింగ్‌లను అలంకరించడానికి లేదా చేతిలో పట్టుకోవడానికే ఇలా బొకేలను తయారు చేయవచ్చు. చేతిలో పట్టుకునే బొకేలు వివిధ రకాల రూపాల్లో వస్తాయి. బొకేలను గులాబీలు, లిల్లీ పూలు, తులిప్‌లు, ఆర్కిడ్లతో తయారు చేస్తారు. వీటిని – నోస్‌గే, క్రిసెంట్, క్యాస్కేడింగ్ బొకేలుగా విభజిస్తారు.

పూల బొకేలను సాధారణంగా జన్మదినాలు, వార్షికోత్సవాలలాంటి ప్రత్యేక దినాలలో అందజేస్తారు. పెళ్లిళ్లలో కూడా వీటిని విస్తృతంగా వినియోగిస్తారు. బొకేలను ఫ్లవర్ వేజ్‌లలో లేదా ప్లాంటర్స్‌లో సంప్రదాయ లేదా ఆధునిక పద్ధతులలో ఏర్పాటు చేయవచ్చు. సంస్కృతిని బట్టి వాటిని వర్ణనాత్మకంగా, ప్రతీకలుగా వివిధ రకాల పూలతో ఏర్పాటు చేయవచ్చు. అయితే ఇవి తొందరగా వాడిపోయే స్వభావం కలిగి ఉండడం వీటిలో ఉన్న ఒక లోపం. పూలు కేవలం మహా అయితే 18 గంటల పాటు మాత్రమే జీవిత కాలాన్ని కలిగి ఉంటాయి.

పూల బొకేల అమ్మకదారులు సాధారణ సమయాల్లో రోజుకు రూ.300-500 వరకూ, సీజన్లలో రూ.1500-2000 వరకూ ఆదాయాన్ని పొందుతారు. ఎక్కువగా గులాబీలు, క్రిసాంథియం, లిల్లీ పూలు, ఆర్కిడ్లను ఉపయోగించి బొకేలను అలంకరిస్తారు. ఒకో బొకే ధర రూ.100 నుంచి వేయి రూపాయల వరకూ ఉంటుంది. బొకేలను విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రయాణాలకు వచ్చి వెళ్లిపోయే వారికి అందించడం మన దేశంలో ఒక సంప్రదాయంగా మారుతోంది. ఆయా ప్రాంతాలను బట్టి బొకేల అమ్మకాలుంటాయి.

బొకేల అమ్మకందారులు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆదాయాన్ని పొందుతారు. పెళ్లిళ్ల సీజన్‌లో వీరు ఒక్కో ఫంక్షన్‌కూ పది వేల రూపాయల వరకూ కూడా పొందుతారు. ఆయా ప్రదేశాన్ని బట్టి, పూల పరిమాణం, వాటి అమరిక విధానంపై ఇది ఆధారపడి ఉంటుంది.

హైదరాబాద్‌లోని మెహదీపట్నం గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పూలు ఎక్కువగా లభిస్తాయి. కొన్ని పూలను విదేశాల నుంచి కూడా దిగుమతి చేసుకుంటారు. ఎక్కువ శాతం పూలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తాయి. మన రాష్ట్రంలో గుడిమల్కాపూర్ అతి పెద్ద హోల్‌సేల్ పూల మార్కెట్. పూలను కొనడానికి ఇక్కడికి అనేక ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. పూలతో పాటు ఇక్కడ అలంకరణలో ఉపయోగించే పన్నీరు, పాలిథీన్ డిజైన్ పేపర్లు, వెదురు బుట్టలు కూడా లభిస్తాయి. ఫ్లోరల్ షీయర్స్, ఫ్లోరల్ టేప్, బొకే పిన్నులు, బొకేను చుట్టే పేపర్లు, కలర్ రిబ్బన్లు కూడా ఇక్కడ లభిస్తాయి. డిజైన్, పూల అమరికను బట్టి పూలను అలంకరించడానికి గంట నుంచి ఇంకా ఎక్కువ పట్టవచ్చు. దిగుమతి చేసుకున్న పూల ధర ఎక్కువగా ఉంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు ఇక్కడ రోజుకు పది వేల రూపాయల వరకూ సంపాదిస్తారు. ఇక రిటైల్ వ్యాపారులు రోజుకు రూ.3000-4000 వరకూ ఆదాయాన్ని పొందుతారు. పూల పెంపకందారులు తమ పూలను దళారులకు విక్రయిస్తారు. వీరు రోజుకు వేయి రూపాయల వరకూ ఆదాయం పొందుతారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో తెల్లవారుఝాము నుంచే హడావుడి మొదలవుతుంది. ఇది మధ్యాహ్నం వరకూ కొనసాగుతుంది. పూలకున్న వాడిపోయే స్వభావం వల్ల వాటిని ఎండ పొద్దులోపే అమ్మేయాల్సి ఉంటుంది. లేకపోతే అవి ఆ తర్వాత కేవలం పశువులకు మేతగా మాత్రమే ఉపయోగపడతాయి. *

## నాయకుడు



వృద్ధుల స్వయం సహాయక సంఘం నాయకురాలు,
బూరుగుపూడి గ్రామం,
కోరుకొండ మండలం, తూర్పుగోదావరి జిల్లా.

## కార్యకర్త/నిపుణులు



వృద్ధుల స్వయం సహాయక సంఘం యానిమేటర్,
బొల్లెద్దుల పాలెం గ్రామం,
కోరుకొండ మండలం, తూర్పుగోదావరి జిల్లా.

## జీవన తంత్రం

# పాలలోని కప్పలు



ఇది ఓ రెండు కప్పల కథ. వీటిలో ఓ కప్ప లావుగా ఉండేది, మరొకటి బక్కగా ఉండేది. ఒకరోజు ఆ రెండూ ఆహారం కోసం వెతుకుతూ, పొరపాటున ఓ పెద్ద పాల గంగాళంలో పడిపోయాయి. ఆ గంగాళం పక్కలు జారుడుగా ఉండడంతో అవి ఎంత ప్రయత్నించినా దాన్నుంచి బయటపడలేక, చుట్టూ తిరగసాగాయి. లావుగా ఉన్న కప్ప, బక్క కప్పతో ఇలా అంది, "తమ్ముడూ, మనం ఇలా ఈత కొట్టి లాభం లేదు. మనం మునిగిపోయేది ఖాయం. అందువల్ల మనం ప్రయత్నించడం వృథా".

దానికి బక్క కప్ప, "కొంచెం ఓపిక పట్టు. అలా కాళ్లు ఆడిస్తూనే ఉండు. ఎవరో ఒకరు రాకపోరు, మనం బయట పడకపోము'' అంది. ఇలా ఆ రెండూ కొన్ని గంటల పాటూ కాళ్లు ఆడిస్తూనే ఉన్నాయి.

మరికొంత సేపటికి లావుగా ఉన్న కప్ప, "తమ్ముడూ! ఇక లాభం లేదు. నేను చాలా అలసిపోతున్నాను. నేను మునిగితే మునుగుతాను. ఇక కాళ్లాడించడం మానేస్తాను. ఈ రోజు ఆదివారం. పనివాళ్లెవరూ కూడా రావడం లేదు. మన పని అయిపోయింది. ఇక్కడి నుంచి బయటపడే అవకాశం లేదు" అంది.

బక్కగా ఉన్న కప్ప, "కాళ్లను కొట్టడం ఆపొద్దు, ప్రయత్నిస్తూనే ఉండు. ఏదో ఒక సహాయం రాకపోదు" అంది. అలా మరికొన్ని గంటలు గడిచాయి లావు కప్ప మళ్లీ, "నేనింక ఏ మాత్రం కాళ్లను ఆడించలేను. మనం ఎలాగూ మునిగిపోతున్నాం. అలాంటప్పుడు మనం ప్రయత్నించడంలో ఎలాంటి అర్థమూ లేదు." ఇలా అని అది కాళ్లు కొట్టడం మానేసింది. దీంతో అది పాలలో మునిగి, చనిపోయింది. కానీ బక్కగా ఉన్న కప్ప కాళ్లను ఆడిస్తూనే ఉంది. పది నిమిషాల తర్వాత బక్కగా ఉన్న కప్ప కింద నేలలాంటిదేదో తగిలింది. దాని కాళ్లు అలా పదేపదే ఆడించడం వల్ల ఆ పాలు వెన్నగా మారాయి. గట్టిగా ఉన్న ఆ వెన్నను తన్నిపెట్టి అది ఆ గంగాళంలోంచి బయటపడింది. ✸

## పుస్తకాలు

### క్లాసిక్ పుస్తకం

### లెట్ మీ స్పీక్



**రచయిత: దొంతిల బారియోస్ డి చుంగర**

ఓ బొలీవియా టిన్ మైనర్ భార్య, బొలీవియన్ మైనింగ్ కార్యకర్త బారియోస్ డి చుంగర జీవితానుభవాలే ఈ పుస్తకం. దీనిలో ఆమె బొలీవియన్ చరిత్రలో 20వ శతాబ్దంలో జరిగిన అల్లకల్లోలాన్ని, కొన్ని ముఖ్యమైన విశేషాలను వివరిస్తారు. లెట్ మీ స్పీక్ అన్న ఈ పుస్తకంలో చుంగర తాను పడిన నరకయాతనను వివరిస్తారు. మైనింగ్ పని అత్యంత కఠినమైనది. పనివాళ్లకు అతి తక్కువ నిద్ర ఉంటుంది. చేసిన పనికి అతి తక్కువ వేతనాలుంటాయి. చాలినంత తిండి ఉండదు. వసతి, సదుపాయాల గురించి చెప్పే పనే ఉండదు. ఒక మహిళగా చుంగర పని కేవలం మైనింగ్, దానితో సంబంధమున్న పనులతోనే అయిపోదు. దాంతోపాటూ ఆమె తన పిల్లలను చూసుకోవాలి. వాళ్లు పాఠశాలలో చెప్పిన పాఠాలు చదువుకొనేలా చూడాలి. ఇంట్లోని వాళ్లకు వంట చేసి పెట్టాలి. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు ఎప్పటికప్పుడు కనుక్కొని వాటిని తీరుస్తూ ఉండాలి. మైనింగ్ కార్మికుల పరిస్థితులను తెలుసుకోవాలనుకునే వారికి ఇదో మంచి పుస్తకం. ✸

### లేటెస్ట్ పుస్తకం

### సస్టైనబుల్ లైవ్లీహుడ్స్



**రచయితలు: క్రిస్టీన్ హెల్మోర్, నరేష్ సింగ్**

ఈ పుస్తకం ప్రపంచ పరిస్థితులకన్నా, ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికలు, వాటిపై కార్యక్రమాల నేపథ్యంలో పేదల అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలన్న వాదనను ముందుకు తెస్తుంది. సుస్థిరమైన జీవనోపాధుల కొరకు భాగస్వామ్య అంచనా కార్యక్రమాలు మరియు ప్రణాళికల రూపకల్పన, లేదా పీఏపీఎస్ఎల్‌లో ప్రజలు తమ పరిస్థితులను తామే స్వయంగా ఎలా పరిస్థితులను అంచనా వేయవచ్చునో, వారి ప్రాధాన్యతలను వారే ఎలా గుర్తించవచ్చునో, వారి అభివృద్ధి కార్యక్రమాలను వారే ఎలా రూపొందించుకొనవచ్చునో రచయితలు వివరిస్తారు. పేదలు తాము స్వయంగా రూపొందించుకున్న అభివృద్ధి ప్రణాళికలు ఫలించాలంటే మూడు ప్రధాన అంశాలు వారి అందుబాటులో ఉండాలని రచయితలు సూచిస్తారు. అవి శాస్త్రసాంకేతిక అంశాలు; పెట్టుబడి, ఆర్థిక సేవలు; సమర్థమైన పాలన, విధానాలు. క్లుప్తంగా చెప్పాలంటే, సస్టైయినబుల్ లైవ్లీహుడ్స్ అభివృద్ధి కార్యకర్తల కోసం చాలా మామూలు పదాల్లో రచించిన ఒక విలువైన పుస్తకం. ✸

### ఈ-వనరులు

1. లీప్ (రాఘవులపేట) – http://livelihoods.net.in/pdf/leap-raghavulupet
2. విలువ గొలుసు (తులసీ) – http://livelihoods.net.in/pdf/vca-tulasi-plant
3. ఉపరంగం (మామిడీ) – http://livelihoods.net.in/pdf/sub-sector-mango
4. ఈ-పుస్తకం – http://www.cifor.org/publications/pdf_files/Books/Household.pdf
5. వీడియో – http://www.youtube.com/watch?v=d4KF8jfTI2I

### అనుబంధాలు

**'ఎలా' అనుబంధం: ప్రొడ్యూసర్ కంపెనీని ప్రారంభించడం**
http://aksharakriti.org/magazines/doc_download/278-jeevanopadhuluanubandhamhow-to-start-a-producer-companydec13

**ఎందరో మహానుభావులు: ఎస్.ఆర్.శంకరన్**
http://aksharakriti.org/magazines/doc_download/277-jeevanopadhuluanubandhamlegenddec13

### ఈ-కోర్సు

**ఈ-కోర్సు – క్యాప్సుల్ 12: అండర్‌స్టాండింగ్ సెల్ఫ్ అర్ టీం మేనేజ్‌మెంట్**
http://www.aksharakriti.org/magazines/doc_download/275-e-course-capsule-12-december-2013-Book

# ‘యోగ’క్షేమం

క్రిస్‌మస్ శుభాకాంక్షలు! నూతన సంవత్సర శుభాకాంక్షలు!

ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీలో చరిత్ర సృష్టించింది. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ, రాజస్థాన్ స్థానాలను కోల్పోయినా, మిజోరాంను దక్కించుకుంది. బి.జె.పి. మధ్యప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ స్థానాలను నిలుపుకుంది.

అభివృద్ధి ఋషి మనోహరన్‌ని స్మరించుకుంటూ!

మార్పు తప్పదని ఈ మాసం రూఢీ చేసింది. మార్గాలు నిర్మించవలసి ఉంది. సమయం కూడా అంతగా లేదు.

‘అనివార్యమైన’ నాయకత్వ నియమాలుగా జాన్ మాక్స్‌వెల్ క్రింద వీటిని పేర్కొన్నారు.

- ప్రభావశీలత అన్నది వారి వారి నాయకత్వ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.
- ప్రభావితం చెయ్యడం అన్నదే నాయకత్వానికి అసలైన కొలమానం; ఇది నిర్వహణ, ఔత్సాహిక వ్యాపారం, మార్గదర్శకత్వం, పరిజ్ఞానం మరియు హోదాలకు భిన్నమైనది. ఇది ఈ వ్యక్తి యొక్క అంత:కరణానికి, లోలోపలి సంబంధాలకు, దూరదృష్టికి అవసరమైన వాస్తవాల గ్రహింపు, అంతరదృష్టి, ప్రావీణ్యం, అనుభవం మరియు ఒక పనిని నెరవేర్చే సామర్థ్యం వంటి వాటికి సంబంధించింది.
- నాయకత్వం అన్నది దినదినాభివృద్ధి చెందే ప్రక్రియ; క్రమశిక్షణ వలన, నిరంతర పరిశ్రమ వలన అభ్యసన కొనసాగుతూ ఉంటుంది;
- నాయకత్వానికి చాలా సన్నాహం అవసరమవుతుంది. వాస్తవాలు, విశ్వాసం ఆధారంగా చేయవలసిన పనులను అత్యంత శ్రద్ధతో నిర్ణయించుకోవాలి;
- నాయకత్వం అంటే ఇతరులకు ఉపయోగపడడం ద్వారా మన విలువను పెంచుకోవడం – వారిని సంరక్షించి, వారి ఉన్నతికి తోడ్పడి, వారికి తెలియచెప్పి, చేయూతనందించడం;
- నాయకత్వం అంటే నమ్మకం;
- నాయకత్వం అంటే గౌరవం;
- నాయకత్వం అంటే అంతరదృష్టి – ఒక పరిస్థితి, పోకడలను, వనరులను, మనుషులను మరియు తనని తాను చదవగలగడం;
- నాయకత్వం అంటే ఆకర్షణ శక్తి–ఒకే జాతి వ్యక్తులకు ఆకర్షించడం;
- నాయకత్వం అంటే ప్రమాణ సిద్ధంగా సంబంధం కలిగి ఉండడం – తనతో, పరిజ్ఞానంతో, ఆచరణతో, అనుసరణతో, ఆశతో, నమ్మకంతో సంబంధం కలిగి ఉండడం మరియు ఆ ‘సంబంధం కలిగి ఉండడం’ పైన దృష్టిపెట్టడం;
- నాయకత్వం అంతర్గత వ్యక్తుల యొక్క ప్రమేయం – మెరుగుదలతో, విలువ–వృద్ధితో మరియు జట్టులో సమన్వయం కలిగి ఉండడం;
- నాయకత్వం ‘వదిలెయ్’ అన్న భావనతో అభద్రతాభావాన్ని ఎదుర్కొని, మార్పును అడ్డుకునే ప్రతిఘటనను అధిగమించి, ఆత్మన్యూనతను తొలగించి సాధికారత కలిగించడం;
- నాయకత్వం అంటే ఒక స్వప్నాన్ని దర్శించి, ఏమిటి, ఎలా మరియు ఎందుకు అన్నదానికి ఒక తార్కాణంగా ఉండడం;
- నాయకత్వం అంటే నాయకుడు ముందు, స్వప్నం తరువాత;
- నాయకత్వం అంటే విజయానికి మరియు ఒకే స్వప్నం/లక్ష్యం కలిగి ఉన్న జట్టు నిర్మాణానికి అంకితమైన నాయకుడు;
- నాయకత్వం ఒక ఉరవడి;
- నాయకత్వం అంటే ప్రాధాన్యతలను ఏర్పరచుకోవడం – అవసరాన్ని బట్టి, రాబడి మరియు ప్రతిఫలాలను బట్టి; 80% మీద దృష్టిపెట్టడం;
- నాయకత్వం అంటే సౌఖ్యమైన మండలాన్ని వదులుకోవడం;
- నాయకత్వం అంటే సమయాన్ని క్రమపరచడం;
- నాయకత్వం అంటే నాయకులను తయారు చెయ్యడం; మరియు
- నాయకుని యొక్క చిరకాల విలువ అతడు మిగిల్చిపోయే చేర్పును బట్టికొలవబడుతుంది – తాను జీవించి చూపించి, తన ఆశయాలను కొనసాగించేవారిని కనుగొని, అధికార దండాన్ని వారికి అందించి, వారిని పోషించి/మార్గదర్శకత్వం వహించడం.

నాయకత్వం వహించాలంటే, మనం ఆ బాధ్యతను తీసుకుని, అందుకు తగిన ప్రయత్నాలను చెయ్యాలి. మనం ఆచరించి క్రమశిక్షణతో ప్రయత్నం చేసి, ఆలోచించాలి. మనందరిలోనూ మహత్తరమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయి కనుక మనమందరమూ నాయకులు అవ్వడానికే ఉన్నాము. మనమే నాయకులు, మనమే నడిపింపబడుతున్న వాళ్ళము. జగన్నాటక సూత్రధారి చేతుల్లో మనము ఏకకాలంలో నడిపింపబడుతూ, నడిపిస్తూ ఉండగలగడం సాధ్యపడుతుంది. విధాత చేత నడిపింపబడుతూ మనం విశ్వం యొక్క ఏకతాళత్వంలోనికి నడిపిస్తాము. ఇందుకొరకు నడిపించేవారు, నడిపించ బడేవారూ ఒకరి లోతులను మరొకరు పరస్పరం తెలుసుకోవలసి ఉంటుంది. ఇందుకొరకు నాయకత్వం వహించేవారిని, నడుపబడుతున్న వారూ కొంత అవిచ్ఛిన్నమైన సమయాన్ని, కలిసి నడుస్తూ, నడిపిస్తూ గడపడం అవసరం. వారు భౌతికంగా విడివడి ఉన్నా, కలిసి సాగుతున్న వీరు ఈ విశ్వం గురించి ఒకే విధమైన, అద్భుతమైన స్వప్నాన్ని దర్శించడం వలన వారిరువురూ ఏకమై ఉంటారు. ఇంక ఇప్పుడు ఏమాత్రం ఆలస్యం సాధ్యపడదు. వారు పరస్పరం సంపూరకంగా చివరకి వారి మధ్యనున్న అంతరం అంతర్ధానమౌతుంది. వారిద్దరూ ఒక్కటిగా మారుతారు.

ఈ విశ్వం కొరకు, నడిపించేవారిని, నడిపించబడేవారిని కలిపి అల్లడం అన్నది లోకనాయకుడి యొక్క దయ మరియు లీల. మనం సన్నద్ధంగా ఉన్నప్పుడు అది జరుగుతుంది. సన్నద్ధం అవడం అంటే తీవ్రమైన ప్రయత్నం శిక్షణ మరియు తీక్షణమైన పరిశ్రమతో కూడిన ఆచరణ. విశ్వం తీవ్రంగా అన్వేషిస్తూ ఉంటుంది! ‘అంతరాత్మ’ ఎడతెగక వెంబడిస్తూ ఉంటుంది! మనం మన శరీరాన్ని, మన జ్ఞానేంద్రియాలను, మన చిన్న ప్రపంచాన్ని ఏకదారిలో పెట్టగలిగితే, అన్వేషణలో నిమగ్నమైన ‘అంతరాత్మ’ తో మరియు విశ్వంతో మనం చేతులు కలిపి, మనం విశ్వానికి ఉపయుక్తంగా మారి, ఉపయుక్తంగా ఉండిపోగలము. ఇలా ‘అంతరాత్మ’తో మనం సంయోగం చెందడంలో లోకనాయకునికి మనయొక్క సంసిద్ధతను తెలియజేస్తుంది. అప్పుడు గురువు పగ్గాలను అందుకుని, మనని మనం పేనుకునేటట్లు చేస్తాడు. మనము కలిసి పేనుకునే విధంగా లోకనాయకుడు మనని నెట్టుతాడు. ఇలా కలిసి పేనుకోవడానికి తగని వారినందరినీ మనం దూరంగా తోసివేసేలా గురువు చేస్తాడు. అప్పుడు మనం తప్పని సరిగా కలిపి పేనుకోబడే కార్యక్రమానికి కట్టుబడి ఉంటాము, గురువు ఎంచుకున్న నిత్యమైన విశ్వజట్టులాగ.

ఇలా ‘లోపల’, ‘బయట’ సంఘటితమవ్వడమే పరమానందం! ఇదే **కృష్ణదళం.** మనం అక్కడికి చేరుకోగలమా? చేరుకోగలం, **మనం ఆత్మయోగాన్ని అభ్యసిస్తే.** మనం ప్రయత్నించి, సన్నద్ధం కాగలిగితే! నడిపించబడేవారికీ, నడుపుతున్న వారికీ సంపూరకంగా ఉండే ఉద్దేశ్యం లేని వాటిని మనం వదిలి పెట్టడానికి నిర్ణయించుకుంటే! నడిపించబడేవారు, నడిపించేవారు నడుపుతున్న వారూ ఎప్పటికీ కలిసి ఉండేలా మనం ఉండనిస్తే! ఆ అల్లకం పనికి నాయకత్వం వహించే వారిచేతులలో పెట్టనిస్తే! నడిపించబడేవారు, నడిపించేవారు కలిసి సహగమనులుగా నిర్గమించేటట్లు మనం చెయ్యగలిగితే! నడిపించబడేవారు, నడిపించేవారిని పోషించి, మార్గదర్శకత్వం వహించే విధంగా మనని మనం తీర్చిదిద్దుకున్నట్లైతే! శ్రీకృష్ణుడు నిశ్చయంగా చెబుతాడు నడిపించబడేవారు, నడిపించేవారు శాశ్వతంగా ఒకరిలో ఒకరు కలిసి పోవడానికి సహ–గమనం చేస్తారని.

మీరూ మాతో యోగప్రపంచంలోకి అడుగు పెట్టండి – నడిపించబడేవారు, నడిపించేవారు కలసి అల్లుకోవడానికి – బృందావనయోగసిద్ధివైపు. మీరు నిరాశ చెందరు.

**–జి. మురళీధర్** ✷



